honeybee.org

Vol-13 Issue-2
వెల : రూ. 20/-

సంపుటి 13 సంచిక 2 మార్చి - ఏప్రిల్ 2025

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక





# నిర్యాణము



కీ.శే. **శ్రీ దరిపల్లి రామయ్య** గారు

నిర్యాణము : 12-4-2025

ప్రకృతి ప్రేమికుడు, కోటికి పైగా చెట్లను నాటి, వాటి పోషణలో కూడా
తనవంతు సహకరించి, ఎన్నో వనాలను తయారు చేసిన
'పల్లెసృజన' కుటుంబ సభ్యుడు, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత
వనజీవి **శ్రీ దరిపల్లి రామయ్య గారు**
12-4-2025న 'పరమ పదించారు'
అని తెలియజేయుటకు చింతిస్తున్నాము.
వారి ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుడ్ని ప్రార్థిస్తూ......
వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.....

అశృతప్త హృదయాలతో అంజలి ఘటిస్తూ....

**పల్లెసృజన కుటుంబం**

సంపుటి-13 సంచిక - 2 మార్చి - ఏప్రిల్ 2025

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్ములమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

## ఈ సంచికలో.....

* చింతకాయల రాంబాబు రైతులకు అందిస్తున్న వరం
విత్తనం, నారు నాటడం, ఎరువులు వేస్తూ అంతర సేద్యం చేసే పరికరాలు - 4
* రైతుల సమస్యలకి కార్పెంటర్ హనీఫ్ పాషా సమాధానం -
మోటార్ సైకిల్‌తో గుంతలు త్రవ్వే 'ఆగర్' - 7
* 'పల్లెసృజన' 51వ చిన్న శోధయాత్ర - యాత్రీకుల అనుభూతులు - 9
* యువత అవగాహనకై పకృతిలో లభించే చెట్ల పేర్లు
సంస్కృతం మరియు తెలుగు భాషల్లో - 18
* ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ 'ప్రకృతి మరియు సేంద్రీయ
రైతు సమ్మేళనం' లో పల్లెసృజన ద్వారా గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల ప్రదర్శన - 20
* కెజిఆర్, సిఇటి ముందడుగుతో సురంగల్ గ్రామంలో కూరగాయల నిల్వ గది -
సహజ శీతలీకరణ కేంద్రం - 22
* పల్లె జ్ఞానం - 24
* సన్న, చిన్న కారు రైతుల పాలిట కల్పవృక్షం
మోటార్ సైకిల్‌తో అసాధారణ సేద్యం చేస్తున్న హజ్రత్ అలి - 26
* ఎన్ఐఎఫ్ వారి 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్
(ఫైన్-2023) పురస్కారాలు - 28
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**
అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు
**మధ్య పేజీలో :**
మార్చి - ఏప్రిల్, 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank,
Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# సహజ సేంద్రియ వ్యవసాయం వైపు రైతును ఆకర్షించడం ఎలా?

కేంద్ర ప్రభుత్వం సహజ సేంద్రియ వ్యవసాయం దేశమంతా విస్తృతం కావాలని, రసాయన ఎరువుల వాడకం పూర్తిగా ఆపాలని, దేశ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలన్న తపనతో వ్యవసాయ పాలసీ 2022లో జారీ చేసింది. ఈ దిశలో ఎన్నో ప్రణాళికలు జాతీయ స్థాయిలో, ప్రాంతీయస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో చివరికి మండల స్థాయిలో కూడా ప్రకటించింది. దానికి కావలసిన బడ్జెట్‌ను సమకూర్చింది. సహజ మరియు సేంద్రియ వ్యవసాయం అంటే ఏమిటి? ఎలా చేయాలి, తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి.... ఇలాంటి మార్గదర్శకాలు దేశ స్థాయిలో విడుదల చేసింది. సహజ మరియు సేంద్రియ వ్యవసాయాలను ప్రభుత్వ పరంగా నిర్వచించింది కూడా. పల్లెసృజన గ్రామ స్థాయిలో జరిపిన చర్చల్లో గమనించింది ఏమిటంటే పై అవగాహన వారివద్దకు చేరలేదు. విస్తృత కార్యక్రమాలు కూడా గ్రామాల్లో కానరాలేదు. వ్యక్తిగతంగా పెద్ద రైతులు, సమాజ సేవ దృష్టిగా ధనవంతులు, విద్యవంతులైన రైతులు సేంద్రియ వ్యవసాయం చేపట్టారు. వీరు వేలల్లో ఉన్నారు. శ్రమిస్తున్నారు, నేర్చుకుంటున్నారు. మెజారిటీ ఇంకా ప్రయోగస్థాయిలోనే ఉన్నారు. సేంద్రియ వ్యవసాయంలో స్థిరపడి, కనీస లాభాలతో ముందుకు సాగుతున్న రైతులు తెలుగు రాష్ట్రాల్లో వందల్లో ఉంటారేమో. వీరి అనుభవాలు విలువైనవి. వీటిని గ్రంథీకరించి, విస్తారంగా రైతులకు అందజయాల్సిన అవసరం ఎంతగానో ఉంది.

ప్రభుత్వ గణాంకాల్లో దేశంలో 85 శాతం సన్నకారు (అంటే రెండు హెక్టార్లకంటే తక్కువ) రైతులని చెపుతున్నారు. వీరు ప్రధానంగా ఆర్థికంగా బలహీనంగా ఉంటారు. అప్పులు చేసి వ్యవసాయం చేస్తారు. ఈ వర్గం వారిలో పెట్టుబడికి అప్పు చేయని వారుండరేమో. అలాంటప్పుడు నూతన ప్రయోగాలు చేయడానికి వెనుకాడతారు సహజమే కదా! ఈ 85 శాతం వర్గాన్ని సేంద్రియ వ్యవసాయం వైపు ఆకర్షింప చేయాలంటే వారు నమ్మగలిగే, ధైర్యం కలిగించే, లాభాలువస్తాయన్న విశ్వాసం కల్పిస్తే తప్పక సేంద్రియ వ్యవసాయ పద్ధతులను స్వచ్ఛందంగా చేపడతారు. అయితే వీరికి తగిన ప్రయోగాలు, వారిని నమ్మించగలిగే వ్యవసాయ మోడల్స్ ఎక్కడా కనిపించడం లేదు. సేంద్రియ వ్యవసాయ పథకాలను, వాటిలోని సూక్ష్మాలను సమావేశాల్లో ఈ సన్నకారు రైతులకు చెప్పడమే తప్ప ఒక ప్రయోగాత్మక కార్యక్రమం ముఖ్యంగా సన్నకారు రైతులకై ప్రతి గ్రామంలో చేసి చూపెట్టాల్సిన అవగాహన వ్యవస్థకు రావటం లేదు. 2-3 ఎకరాల క్షేత్రంలో ప్రతి గ్రామంలో పైలట్‌గా ఉదాహరణగా ఒక సంవత్సరం ప్రభుత్వం తరుపున సేంద్రియ వ్యవసాయం చేసి, ఆ గ్రామ రైతులకు విజయవంత ప్రయోగం చూపించాలి. అందరు రైతులు ఈ ప్రయోగాన్ని రోజూ చూస్తూ, అందులోని ముఖ్యాంశాలను పరిశీలించి అవగాహన చేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. మొదటి సంవత్సరంలో పైలట్‌గా ఒక గ్రామానికి మొత్తం 50 ఎకరాల్లో (2-3 ఎకరాల చిన్న పొలాల్లో) చేపట్టాలి. రెండు పంటల్లోని వైవిధ్యాలు, జాగ్రత్తలు, నష్టాలు, లాభాలు, పెట్టుబడి, శ్రమ, యంత్రాల ఉపయోగం పంట గుణత్వం, అమ్మితే వచ్చిన ధర.... ఇవన్నీ రైతులు స్పష్టంగా, వారే చూసి నేర్చుకుంటారు. తమ ఊర్లోనే జరుగుతుంది కాబట్టి అందరూ ఈ పైలట్ సేంద్రియ వ్యవసాయం - సన్నకారు రైతులకై చేపట్టిన పథకాన్ని తిలకిస్తారు. నేర్చుకుంటారు.



రెండవ సంవత్సరంలో ఆ గ్రామాల్లో కొందరు ఔత్సాహిక రైతులు ముందుకు వచ్చి

సేంద్రియ వ్యవసాయం చేపడతారు. "ఇది తథ్యం". వీరికి తగిన సహాయం, మార్గదర్శకత్వం, కావలసిన సేంద్రియ ఎరువులు, పరికరాలు, యంత్రాలు, సమయానికి సలహాలు.... ఇవన్నీ వ్యవస్థ ప్రతి గ్రామములోను ఏర్పాటు చెయ్యాలి. రైతుల మధ్య ఈ మార్గదర్శకుల మధ్య మంచి అవగాహన, పరిచయాలు వీరిని ఒక టీముగా తయారు చేస్తాయి. ఈ దశలో అడక్కుండానే సేంద్రియ వ్యవసాయం చేపట్టిన రైతులకు పూర్తి సహకారం అందించి, వారు సునాయాసంగా రెండు పంటలు పండించ గలిగితే ఆ ఊరి ప్రజలు మరింత ప్రభావితులై మెల్లి మెల్లిగా ఊరు ఊరంతా సేంద్రియ వ్యవసాయం చేపడుతారు. దాదాపు అయిదు సంవత్సరాల్లో ఊరంతా ముఖ్యంగా సన్నకారు రైతులు సేంద్రియ వ్యవసాయం చేపట్టడం తథ్యం. స్థానిక వ్యవస్థ, ఊరి ప్రజలకు సంపూర్ణ సహకారం, మార్గదర్శకత సంపూర్తిగా ఇచ్చినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఇలాంటి కొన్ని ప్రణాళికలు కేంద్ర ప్రభుత్వ సేంద్రియ పాలసీలో ఉన్నాయి. వీటిని వాడుకుంటూ, గ్రామ గ్రామానికి, పంట పంటకూ కావలసిన మార్పులు సేంద్రియ పద్ధతిలో చేరుస్తూ రైతులకు ఆత్మీయతతో నేర్పించ గల్గితే గ్రామాల్లోని సన్నకారు రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్ళించాలన్న కల సాకారమవుతుందని పల్లెసృజన విశ్వసిస్తున్నది.

గత సంపాదకీయాల్లో సేంద్రియ వ్యవసయానికి కావలసిన యంత్రాలను తయారు చేయడమో, ఉన్నవాటిని సేకరించి అన్ని గ్రామాలకు విస్తరింప జేయడమో తప్పక జరగాలని విన్నవించుకున్నాము. పల్లెసృజన గత 20 సంవత్సరాల్లో సేకరించిన పనిముట్లు, యంత్రాలు, ప్రముఖంగా సేంద్రియ వ్యవసాయానికి ఎంతో విలువను జోడిస్తాయి. వ్యవస్థ, వ్యవసాయదారులు రైతుల కొరకు రైతులు ఆవిష్కరించిన ఇన్నోవేషన్లను కూలంకషంగా పరిశీలించి వాడితే లబ్ధి తప్పక చేకూరుతుందని మా విశ్వాసం.

పల్లెసృజన గమనించింది ఏమిటంటే వ్యవస్థ కాని, సమాజ సేవలో ఉన్న సంస్థలు కాని, వ్యవసాయంలో రైతులకు పరికరాలు ఒక్కొక్క రకమైన పనికి తయారు చేసి అందిస్తారు. విత్తనాలు వేయడానికి ఎరువులు చల్లడానికి, కలుపు తీయడానికి, వగైరా. అయితే రైతుకు కొంచెం సులువు చెయ్యాలంటే "కిట్" లాగా ఈ పరికరాలు, యంత్రాలు ఇస్తే బాగుంటుందని మేం అభిప్రాయ పడుతున్నాం.

"పల్లెసృజన మిరప కిట్' గురించి పాఠకులకు విదితమే. ఈ కిట్ ఉద్దేశ్యం - పెట్టుబడి ఖర్చు, సమయం తగ్గించడం, దిగుబడిని పెంచడం. ఆ పంటకు కావలసిన అన్ని పనులకు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లతో కూడిన ఒక కిట్ తయాలు చేసి 40-50 ఎకరాలకు ఈ కిట్ ఉపయోగ పడేలా చేయడం. 'పల్లెసృజన మిరప కిట్' 50 ఎకరాలకు సరిపడేలా నాలుగున్నర లక్షలకు అందుబాటులో ఉంది. ఇది ఎఫ్.పి.ఓ. కాని, రైతు సమాజాలు కాని కొంటే ఎకరానికి 9 వేల రూపాయల ఖర్చు అవుతుంది. ఈ కిట్ వాడటం వలన పెట్టుబడి ఖర్చు ఎకరానికి 20-30 వేల దాకా తగ్గుతుంది. ప్రతి వ్యవసాయ పనికి మిరప పంటకు ఈ కిట్‌లో ఒక పరికరం నిర్దిష్టంగా ఉంటుంది. ఇలా వ్యవస్థ, పల్లెసృజన, స్వచ్ఛంద సంస్థలు తెలుగు రాష్ట్రాల్లోని పది ప్రధాన పంటలకు ప్రత్యేక కిట్‌లు తయారు చేసి 1-2 సంవత్సరాలు పైలట్ ప్రాజెక్టు చేసి, ఈ కిట్లను ఫైనల్ చెయ్యాలి. నాబార్డు సంస్థ, సిఎస్ఆర్ పరంగా ఎఫ్‌పిఓలకు రైతు సమాజాలకు ఈ కిట్లను పంచాలి. స్థానిక వ్యవసాయ అధికారులు ఈ ప్రయోగాలను సరిగ్గా చేసేలా పర్యవేక్షణ చేయాలి. యువ వ్యవసాయ డిగ్రీలు పొందిన వారిని ఈ పైలట్ ప్రాజెక్టులోల పాల్గొనేలా చేయాలి.

మీ సలహాలు, విమర్శలు మాకు వ్రాయండి. మాతో సహకరించడానికి మీరు ముందుకు వస్తారన్న ఆశతో.... లోకా సమస్తా సుఖినోభవంతు....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

**"పల్లెసృజన విశ్వాసం"**

✤ రైతులు గ్రాహకులు కాదు ప్రొవైడర్స్ ✤ ఊళ్ళు అంతులేని బావులు కాదు - అవి సోర్స్

## చింతకాయల రాంబాబు రైతులకు అందిస్తున్న వరం

# విత్తనం, నారు నాటడం, ఎరువులు వేస్తూ అంతర సేద్యం చేసే పరికరాలు



- వీరరాఘవ రెడ్డి

'చింతకాయల రాంబాబు' (50 సం.) పుట్టింది కృష్ణా జిల్లా 'ఆగిరిపల్లి' గ్రామమైనా 25 సంవత్సరాల క్రితం అదే జిల్లాలోని 'జి–కొండూరు' మండల కేంద్రంలో స్థిర నివాసం ఏర్పరచుకొన్నాడు. సృజనాత్మకంగా ఆలోచించి, రైతు అవసరానికి తగ్గ వ్యవసాయ పరికరాలను చేయటం ఇతని ప్రత్యేకత. 2020 జనవరి–ఫిబ్రవరి 'పల్లెసృజన' సంచిక ద్వారా రాంబాబు పాఠకులకు పరిచయమే.

ప్రస్తుతం గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన మైన సమస్యల పట్ల ఎంతో కలత చెంది వారి పెట్టుబడి ఖర్చును తగ్గిస్తూ, తన ఆదాయాన్ని పెంచుకుంటూ తన సృజనాత్మకత ద్వారా రైతులకు దగ్గరి బంధువయ్యాడు చింతకాయల రాంబాబు. కృష్ణా జిల్లా అంటేనే రైతులకు పెట్టింది పేరు. వారి వ్యవసాయ విధానాలను యావత్ తెలుగు రైతాంగం ఎప్పటికప్పుడు గమనిస్తూ, వాటిని గురించి తెలుసుకుంటూ, వారిలా వ్యవసాయం చేసి లాభాల బాట పట్టాలని మిగతా ప్రాంతాల రైతులు అనుకుంటూ ఉంటారు అంటేనే తెలుస్తుంది వారి వ్యవసాయ విధానాలు ఎంత కొత్తపోకడలు పోతుంటాయో. ఆ ప్రాంత రైతుల ఆలోచనలకు రూపునిచ్చే పని చేస్తుంటాడు రాంబాబు. ఇలా తయారు చేసిన కొన్ని ట్రాక్టర్ అనుసంధాన వ్యవసాయ పరికరాలను గురించి మనమిప్పుడు తెలుసుకుందాం.....

**విత్తనం వేసే డ్రమ్ సీడర్:**

చాలా రకాల పంటల విత్తనం వేసేందుకు ఇప్పటికే ట్రాక్టర్ అనుసంధాన విత్తనం గొర్రు పరికరం గురించి విని ఉంటారు. కానీ ప్రత్తి, మొక్కజొన్న, కంది లాంటి విత్తనం వేయాలంటే విత్తనం గొర్రు పరికరాలు లేవు. ఉన్నా అవి అంతగా విజయవంతం కాలేదు విత్తనం కూడా దుబారా (ఎక్కువ) అవుతుంది అన్న విషయం రైతులకు బాగా తెలుసు. అందుకే ఇప్పటికీ ప్రత్తి, కంది, మొక్కజొన్న విత్తనాలను రైతులు మనుషుల చేతనే నాటిస్తూ ఉన్నారు. అందుకు కారణం ఆ విత్తనాలను రైతు తన పొలం యొక్క బలాన్ని దృష్టిలో ఉంచుకుని అర అడుగు నుంచి ఒకటిన్నర అడుగుల దూరం లో ఒక్కో మొక్క ఉండేలా నాటిస్తూ ఉంటారు. ఇలా అంత దూరానికి ఒక్కో విత్తనం మాత్రమే నాటేలా ఏ గొర్రూ లేదు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో కూలీల భారం, పెట్టుబడి ఖర్చు పెరిగినా ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో మనుషులను పెట్టి ఈ విత్తనాలు నాటిస్తూ ఉన్నారు. ఆ విధంగా మనుషులు నాటడం వల్ల ఒక్కో వ్యక్తి ఒక్కో రకంగా విత్తనం నాటడం వల్ల మొలక శాతం 70 నుండి 80 వరకు మాత్రమే ఉంటుంది. అలా కూలీల ఖర్చు పెరగటంతో పాటు విత్తనం కూడా వృధా అయ్యే అవకాశం ఎక్కువ.

ఈ సమస్యను గురించి కొందరు రైతులు రాంబాబుతో చర్చించి దీనికి పరిష్కారం మార్గం చూడమని కోరటం జరిగింది. రాంబాబు ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలి అని ఆలోచించి, యూట్యూబ్‌లో లభించి ప్రపంచంలో ఎన్నో రకాల విత్తనం గొర్రుల వీడియోలను పరిశీలించి, మన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రాంతాలకు అనువుగా ఉండేలా డ్రమ్ సీడర్‌ను తయారు చేశాడు.

ఈ డ్రమ్ సీడర్‌లో విత్తనం మొత్తం గుమ్మరించిన తర్వాత ఆ విత్తనం పొలంలో మొక్కకు మొక్కకు మధ్య ఎంత దూరం ఉండాలో నిర్ణయించుకుని దానికి అనుగుణంగా విత్తే దూరాన్ని మార్చుకోవచ్చు. అలాగే పొలంలో పదును ఎంత వరకు ఉందో తెలుసుకుని, అంత





విత్తనం వేసే పరికరం

లోతులో విత్తనం పడేలా లోతును కూడా మార్చుకోవచ్చు. అంతే కాక సాలుకు సాలుకు మధ్య దూరాన్ని కూడా అవసరమైనంత మేరకు మార్చుకోవచ్చు. సాధారణంగా ప్రత్తి, మొక్కజొన్న, కంది విత్తనాలను 12 నుంచి 16 అంగుళాల దూరంలో నాటుకుంటారు. ఈ డ్రమ్ సీడర్ లోనుంచి భూమిలోకి ఒక్కో విత్తనం మాత్రమే క్రిందకు వెళుతూ వుంటుంది. పొలం మొత్తం ఒకటే రకంగా సరైన లోతులో విత్తనం పడుతుంది. భూమిలో పడిన విత్తనాన్ని ఆ గొర్రు సాలు వెనకనే వస్తున్న ఒక చక్రం సరైన మోతాదులో ఒత్తిడి చేస్తూ దొర్లుకుంటూ రావటం ద్వారా ఆ విత్తనంపైన అవసరమైన మోతాదులో వత్తిడితో మట్టిని కప్పివేస్తూ ఉంటుంది. కాబట్టి 100శాతం విత్తనం మొలక ఎత్తే అవకాశముంటుంది.

ప్రత్తి, కంది, మొక్కజొన్న విత్తనాలే కాకుండా ఈ పరికరంతో నువ్వులతో సహా ఏ విత్తనమైనా నాటుకోవచ్చు. కాకపోతే విత్తనం పరిమాణాన్ని (లావును) బట్టి అవసరమైన ప్లేట్లను సీడర్ డ్రమ్ములో మార్చాల్సి ఉంటుంది. విత్తనం మాత్రం సరైన లోతులో, సరైన దూరంలో భూమిలోపలికి వెళ్ళటం వల్ల పొలంలో పంట సమాంతరంగా మొలకెత్తుతుంది. సమాన దూరంలో విత్తుకోవటం వల్ల మొక్కలకు గాలి కూడా బాగా అందటంతో పంట కూడా ఏపుగా పెరుగుతుంది.

ఈ విత్తనాలు విత్తే పనిని మనుషులు నాటాలంటే ఒక ఎకరాకు ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు నాటుతారు. వారు నాటే దూరం, లోతుల్లో తేడా ఉండటం వల్ల పొలంలో పంట సమాంతరంగా కనపడదు. కానీ ఈ ట్రాక్టర్ అనుసంధాన విత్తన సీడర్‌తో విత్తుకోవటం


డ్రమ్ములలో వేసిన ప్రత్తి విత్తనాలు

వల్ల ఒక ఎకరా పొలాన్ని కేవలం అర గంటలో విత్తుకోవచ్చు. 5 ఎకరాల పొలంలో విత్తనం విత్తుకోవాలంటే దాదాపు 10 మంది వ్యక్తులు రోజంతా నాటాల్సి ఉంటుంది. ఈ డ్రమ్‌సీడర్ ద్వారా విత్తుకుంటే 5 ఎకరాల పొలాన్ని రెండున్నర మూడు గంటల్లో విత్తుకోవచ్చు. ఈ విధంగా రైతుకు కూలీల ఖర్చు తగ్గటంతో పాటు, సమయం కూడా ఎంతో ఆదా అవుతుంది. విత్తనం వెయ్యటానికి ట్రాక్టర్ డ్రైవరు, సహాయకారిగా పొలం రైతు ఎటూ ఉంటాడు కాబట్టి కూలీల ఖర్చు అసలే ఉండదు. మొత్తానికి ఈ విత్తన సీడర్ వల్ల రైతుకు ఎంతో లాభం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ డ్రమ్ సీడర్‌ను ఇంకా అభివృద్ధి చేసే ఆలోచనలో కూడా ఉన్నాడు ఇన్నోవేటర్ చింతకాయల రాంబాబు.

**నారు నాటే ట్రాక్టర్ అనుసంధాన పరికరం:**

మిరప, పొగాకు, కూరగాయ పంటల నారు నాటాలంటే రైతుకు చాలా హడావిడితో కూడుకున్న పని. ఎంతో మంది కూలీలు అవసరం కాబట్టి ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఒక్క ఎకరం పొలంలో నారు నాటాలంటే కనీసం నలుగురు మనుషులు త్వరగా నాటు వేస్తే కూడా మధ్యాహ్నం వరకు ఒక ఎకరం పొలం నాటగలరు. నారు నాటే వారు అందరూ ఒకేరకంగా నాటరు. కొందరు పైపైనే నాటుతారు, కొందరు లోతుగా నాటుతారు. కాబట్టి నాటిన మొక్కలు బ్రతికే అవకాశం 70 నుండి 80 శాతం వరకు మాత్రమే ఉంటుంది.

ఈ సమస్యను పరిష్కరించడానికి మిరప నారు నాటేందుకు ఒక ట్రాక్టర్ అనుసంధాన పరికరాన్ని తయారు చేశాడు రాంబాబు. ఈ పరికరం దాదాపుగా మనదేశంలో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేదని అంటాడు రాంబాబు. ఇతను తయారు చేసిన పరికరం పైన ఇద్దరు వ్యక్తులు కూర్చొని ఉంటారు. ఒక డ్రమ్ము లాంటి పరికరం పైకి వచ్చినప్పుడు అందులో మనిషి నారు మొక్కను వేస్తాడు ఆ మొక్కను అలాగే భూమివరకు తీసుకు వెళ్తుంది. భూమికి ఒక అంగుళం దూరం ఉండగా ఆ డ్రమ్ములోని మొక్క భూమిపైన పడేలా ఏర్పాటు చేయబడింది. గొర్రు వెంటనే వస్తున్న ఇరువైలా ఉన్న చక్రాలు మట్టిని మొక్క దగ్గరకు వత్తివేస్తాయి. గొర్రు సాలు 3 అంగుళాల లోతు వరకు పొలాన్ని దున్నుతుంది, అందులో మొక్క పడిన వెంటనే ఆ గొర్రు కొయ్యను ఆనుకునే వస్తున్నటు వంటి చక్రాలు మట్టిని మొక్క దగ్గరకు వత్తివేస్తాయి కాబట్టి మొక్క నిటారుగా నిలబడుతుంది. ఇలా ఒక ఎకరం మొక్కలు నాటడానికి గంటకన్నా తక్కువ సమయమే పడుతుంది. పొలమంతా సమానమైన లోతులో, సమానమైన దూరంలో మొక్కలు నాటు వేయబడతాయి. మొక్కలు కూడ 100% బ్రతికే అవకాశాలు ఉంటాయి. నారు నాటిన వెంటనే పొలంలో నీటిని వదులుతారు కాబట్టి మొక్కలు బ్రతికే అవకాశాలు ఎక్కువ.


ఇద్దరు వ్యక్తులు కూర్చుని నారు వేసేలా కప్పుల ఏర్పాటు


నారు నాటే పరికరం


ఎరువులు వేయడం, అంతర సేద్యం ఒకేసారి చేసే పరికరం

నారు నాటడంలో మరో పద్ధతి అవలంభిస్తారు కొందరు రైతులు. పొలంలో ఒక వ్యక్తి గాతాలు చేసుకుంటూ వెళ్తాడు, మరో వ్యక్తి అందులో నీటిని పోస్తూ వెళ్తుంటే, వారిద్దరి వెనకాల మహిళ ఆ నీరు పోసిన గాతాల్లో నారు నాటుకుంటూ వెళుతుంది. ఇలా నారు నాటడం ఒక క్లిష్టమైన పని.

ఈ సమస్య పరిష్కారాన్ని కూడా ఇదే యంత్రంలోనే తయారు చెయ్యాలని ఆలోచిస్తున్నాడు రాంబాబు. నారు నాటడంతో, వెనువెంటనే దాన్ని మట్టితో కప్పటంతో పాటు, వెంటనే ఆ మొక్క మొదలు వద్ద నీరు పడేలా ఏర్పాటు చెయ్యాలని చూస్తున్నాడు. ఈ ప్రయోగం కూడా త్వరలో విజయవంతం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాడు చింత కాయల రాంబాబు. వీలైనంత త్వరలో అంటే వచ్చే నారు నాటే సీజన్ లోపలే ఈ ఏర్పాటు పూర్తి చెయ్యాలని ఆలోచిస్తున్నాడు. ఇది విజయ వంతం అయితే రైతాంగానికి వేలాది రూపాయల ఖర్చును, శ్రమను తగ్గించిన వాడవుతాడు రాంబాబు. 5 ఎకరాల పొలం నాటాలంటే 10 మందికి పైగా కూలీలు ఒక రోజంతా నాటాల్సి ఉంటుంది. కానీ ఈ పరికరంతో 5 ఎకరాల పొలాన్ని కేవలం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులతో 4గంటల్లోనే నాటు వేయవచ్చు. నారు కూడా సమానంగా నాటడం జరుగుతుంది కాబట్టి పంట కూడా సమాంతరంగా కనపడుతుంది. 100 శాతం మొక్కలు కూడా బ్రతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దానివల్ల దిగుబడి పెరిగే అవకాశాలు ఎక్కువ. ఈ ట్రాక్టర్ అనుసంధాన పరికరం లక్షన్నర రూపాయల వరకు ఖరీదు అవుతుంది అంటాడు రాంబాబు.

ఈ పరికరం ద్వారా మొక్కల మధ్య దూరం 12 నుండి 24 అంగుళాల వరకు మార్చుకునే సదుపాయం ఏర్పాటు చేయబడింది. అలాగే సాళ్ళ మధ్య దూరాన్ని కూడా మార్చుకునే సదుపాయం కూడా ఏర్పాటు చేశాడు. రైతు పొలం యొక్క బలాన్ని బట్టి సాళ్ళ మధ్య దూరం పెంచుకుంటారు రైతులు. బలమైన పొలం అయితే పంట ఎక్కువ ఎదుగుదల ఉంటుంది కాబట్టి సాళ్ళు మూసుకు పోయి, అంతర సేద్యాలు చేసేందుకు త్వరగా అవకాశం తగ్గిపోతుందని సాళ్ళ మధ్య దూరాన్ని పెంచుతారు కొందరు రైతులు.

ఈ పరికరంతో ఒక్క మిరప నారు మాత్రమే కాక, ఏ నారైనా నాటుకోవచ్చు. అంటే ఉల్లి, మిరప, పొగాకు, కూరగాయల నారు.... ఇలా ఏ నారైనా నాటుకోవచ్చు. ప్రస్తుతం తయారు చేసిన పరికరం కేవలం రెండు సాళ్ళలో మాత్రమే నారు నాటుతుంది. ఇది పూర్తిగా విజయవంతం కావటం వల్ల దీన్ని ఇంకా అభివృద్ధి చేసి, మూడు మరియు నాలుగు సాళ్ళలో ఒకేసారి నారు నాటేలా కూడా చేయవచ్చు అంటున్నాడు రాంబాబు.

ఈ యంత్రాన్ని తయారు చెయ్యటం ద్వారా చింతకాయల రాంబాబు రైతుల నెత్తిన పాలు పోసినట్లు అయ్యింది అనటంలో ఎలాంటి సందేహం లేదు.

**ఎరువులు వేయడం, అంతర సేద్యం ఒకేసారి చేసే ట్రాక్టర్ పరికరం:**

కొంతమంది రైతులు తమ మిరప, ప్రత్తి, కూరగాయల పంటల్లో ఎరువులను విసిరేస్తూ వెదజల్లుతుంటారు. మరి కొందరు మొక్కల మొదళ్ళ వద్ద వేస్తూ వుంటారు. ఈ రెండు పద్ధతుల వల్ల వేసిన ఎరువులో కొంత శాతం మాత్రమే మొక్కకు అందుతుంది. మిగతాదంతా వాతావరణంలో ఆవిరైపోయే అవకాశాలు ఎక్కువ. కాబట్టి కొందరు రైతులు ఎరువులను జడిగాలతో మొక్కలకు కొద్ది దూరంలో వేస్తూ ఉంటారు. ఈ పనులన్నీ కూడా, ఎక్కువ మంది కూలీలతో చెయ్యాల్సినవి కాబట్టి ఖర్చుతో కూడుకున్నవి.

ఈ సమస్య పరిష్కారానికి చింతకాయల రాంబాబు ఒక ట్రాక్టర్ అనుసంధాన పరికరాన్ని తయారు చేశాడు. ఈ పరికరం ద్వారా ఒకేసారి మూడు సంచుల ఎరువును అందులో వేసినట్లయితే ఆ మందును మొక్క మొదళ్ళ వద్ద భూమిలో వేస్తూ వెళుతుంది. దాని వెనకే ఆ వేసిన ఎరువుపైన మట్టిని కప్పివేస్తూ ఉంటుంది. అంతే కాకుండా వెనకాల సాళ్ళ మధ్యలో అంతర సేద్యం కూడా చేస్తూ వెళ్తుంది. ఈ విధంగా చెయ్యటం వల్ల వేసిన ఎరువు 100% మొక్కలకు అందుతుంది. వాతావరణంలో ఆవిరై కలిసి పొయ్యే అవకాశమే ఉండదు. పైగా రెండు పనులు అంటే ఎరువులు వెయ్యటం, అంతర సేద్యం చేయటం ఒకేసారి జరిగిపోతాయి కాబట్టి అదనపు ఖర్చు తగ్గటంతో పాటు, ఎరువు కూడా వృధా కాకుండా మొక్కలకు అందుతుంది. దాదాపు 30 శాతం ఎరువు ఆదా అవుతుందని రైతులే అంటున్నారు. కాబట్టి రైతుకు ఎంతో లాభదాయకమైన ఈ పరికరాన్నిఆనందంగా వినియోగించు కుంటున్నారు.

వీటితో పాటు చింతకాయల రాంబాబు పంటపై పురుగు మందు పిచికారి చేసేందుకు కూడా ట్రాక్టరుకు ఎన్నో మార్పులు ఇప్పటికే చేయటం జరిగింది. బూమ్ స్ప్రేయర్‌ను కూడా వెనక భాగంలో ఏర్పాటు చేసి, వాటి రెక్కలను పురుగు మందును ప్రతిసారి అతికించా ల్సిన అవసరం లేకుండా వాటంతట అవే ట్రాక్టర్ ప్రక్కలకు ముడుచుకు పోయేలా తయారు చేసే ఆలోచనలో ఉన్నాడు. రైతాంగానికి ఎంతో పెట్టుబడి ఖర్చులను తగ్గించేలా పరికరాలను తయారు చేస్తున్న చింతకాయల రాంబాను అభినందిస్తోంది 'పల్లెసృజన'. తెలుగు రాష్ట్రాల రైతులు ఈ పరికరాలను ఉపయోగించుకొని తమ పెట్టుబడి ఖర్చులను వీలైనంత వరకు తగ్గించుకోవాల్సింది గా కోరుతోంది.

**ఇన్నోవేటర్ చింతకాయల రాంబాబు, ఫోన్ : 9949927037**



## రైతుల సమస్యలకి కార్పెంటర్ హనీఫ్ పాషా సమాధానం

# మోటార్ సైకిల్‌తో గుంతలు త్రవ్వే 'ఆగర్'

- వీరరాఘవ రెడ్డి

అవసరం మనిషిని 'ఇన్నోవేటర్'గా మారుస్తుంది అనటానికి మరో ప్రత్యక్ష ఉదాహరణ ఉమ్మడి కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల జిల్లా), జూపాడు బంగ్లా మండలం, మండ్లెం గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ హక్, సయ్యదా ఇక్కెదియాదిల కుమారుడు "సయ్యద్ హమీద్ పాషా". ప్రస్తుతం కార్పెంటర్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉన్నాడు. ఇతనికి తన స్వగ్రామం మండ్లెం లో 8 ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ, ఉల్లి, జొన్నలు..... ఇలా పంటలు వేసి చాలా నష్టపోయాడు. ఒక సంవత్సరం వర్షాలు లేక పంటలు రావు, పంటలు బాగా వచ్చినపుడు మార్కెట్ ఉండదు.... ఇలా కుదరదు అనుకొని తన పొలంలో ఏవైనా చెట్లు నాటి ఉద్యాన పంటలు పండిద్దాము, అలా చేస్తే కొన్ని రోజులు కష్టపడితే చాలు అవే జీవితాంతం మమ్మల్ని పోషిస్తాయి కదా అని అనుకున్నాడు.

స్వతహాగా కార్పెంటర్ కావడంతో తన పొలంలో ఏవో పండ్ల చెట్లు నాటడం కంటే తన వృత్తికి అవసరమైన చెట్లు నాటుకుంటే మేలు కదా అని ఆలోచించి 'మలబార్ వేప', 'శ్రీగంధం చెట్లు' నాటుదామని నిర్ణయించు కున్నాడు. తన పొలంలో ఎకరాకు 450 మలబారు వేప, 450 శ్రీగంధం చెట్లు పడతాయని తెలుసుకుని వాటిని నాటాలని నిర్ణయించు కున్నాడు. తన 8 ఎకరాల పొలం మొత్తానికి 3,500 మలబారు వేప, 3,500 శ్రీగంధం చెట్లు పడతాయని ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు.

మలబారు వేప మంచి 'ప్లైవుడ్' తయరీకి ఉపయోగ పడుతుంది. ఈ కలపతో చేసిన ప్లైవుడ్ చాలా నాణ్యతతో ఉంటుందని అతనికి తెలుసు. ఈ కర్రకు చెదలు పట్టవు, కర్ర కూడా చాలా తేలికైనది. ఇక శ్రీగంధం చెట్లకు మార్కెట్‌లో మంచి విలువ వుంది లేదా తన కార్పెంటర్ వృత్తితో గృహావసరాలైన ఫర్నిచర్ చేసుకుంటే మంచి ఆదాయం ఉంటుంది కదా అనుకున్నాడు. చెట్లు నాటాలి అంటే తన పొలంలో మొత్తం 7 వేల గుంతలను త్రవ్వాలి. ఒక గుంత త్రవ్వడానికి 100 రూపాయల కూలీ తీసుకునే వారు అప్పుడు. ఒక్కో మనిషి రోజుకు కేవలం 5 గుంతలే త్రవ్వేవాడు. మొత్తం 7 వేల గుంతలు త్రవ్వాలంటే చాలా సమయం పడుతుంది పైగా ఖర్చు 7 లక్షల దాకా అవుతుంది. ఈ సొమ్మంతా భూమిలో పొయ్యాల్సిందే తప్ప అది తిరిగి వచ్చేది కాదు. గుంతల కోసం ఇంత ఖర్చు చేయలేములే అనుకుని మార్కెట్‌లో విచారించి గుంతలు త్రవ్వేందుకు ఒక చైనా ఆగర్ మిషన్ తెచ్చుకుని పని చెయ్యడం మొదలు పెట్టాడు. ఆ యంత్రం కేవలం 4−5 గుంతలు తీసే సరికే అది పని చెయ్యక మొరాయించింది. ఇలా చెడిపోయిన ప్రతిసారి దాన్ని రిపేరు చేయించుకోవటానికి వెళ్ళాలంటే మళ్ళీ అదో అదనపు ఖర్చు. పైగా చైనా మిషన్‌లు రిపేరు చెయ్యటం కష్టమని తెలుసుకుని ఏం చేద్దామా అని ఆలోచించడం మొదలు పెట్టాడు.

ఇలా కుదరదు అనుకుని తిరిగి తను హైదరాబాద్ వెళ్ళి తన





కార్పెంటర్ పని చేసుకుంటూనే సమయం దొరికినప్పుడల్లా తానే ఒక గుంతలు త్రవ్వే 'ఆగర్' యంత్రం తయారు చేసుకోవాలని నిర్ణయం తీసుకుని ఆవైపు తన పని ప్రారంభించాడు. మొదట బాగా మైలేజ్ వచ్చే ఒక బజాజ్ సిటి-100 మోటార్ సైకిల్ తీసుకున్నాడు. ఎందుకంటే ఇదైతే మైలేజీ బాగా వస్తుందని అనుకున్నాడు. ఆ తర్వాత ఒక పాత మోటార్ సైకిల్ ఇంజన్ తీసుకుని, దానికి అవసరమైన గేరు బాక్సులు ఇతర సామాగ్రి కొనుగోలు చేసి ఎన్నో ప్రయోగాలు చేసి తన మెకానిక్ మిత్రులతో కలిసి తగిన సలహాలు తీసుకుని మొత్తానికి 'మోటార్ సైకిల్ ఆగర్' తయారు చేసుకున్నాడు. తన మొదటి ప్రయత్నం లోనే అది బాగా పని చేస్తుందని ప్రయోగాలు చేసి చూసుకున్నాడు. ఈ యంత్రంతో కేవలం ఒక్క నిమిషం లోపలే ఒక గొయ్యి తియ్యటం జరిగింది. హమ్మయ్య ఇది బాగా పని చేస్తుందని సంతోసంతో ఆ యంత్రాన్ని తీసుకుని మళ్ళీ తన గ్రామానికి వెళ్ళాడు.

కేవలం 3 లీటర్ల పెట్రోలు ఖర్చుతో రోజుకు 300 నుంచి 400 గోతులను సునాయాసంగా తీసుకున్నాడు. ఈ గుంతలు త్రవ్వేటపుడు 35-40 మి.మీ. ఘన పరిమాణం గల రాళ్ళను కూడా బైటకు తీసి వేస్తుంది. పెద్ద రాయి పడితే మాత్రం గుంత త్రవ్వడం కుదరదు. ఈ ఆగర్ కూడా గుంత తీసేటపుడు త్వరగా అరిగి పోకుండా 'డైమండ్ టిప్స్' ఏర్పాటు చేశాడు. ఈ ఆగర్‌ను మోటార్ సైకిల్‌కే ఏర్పాటు చేసుకు న్నాడు కాబట్టి ఎక్కడికైనా సులభంగా మోటార్ సైకిల్ నడుపుకుంటూ వెళ్ళి ఎవరికి కావలిస్తే వారి పొలానికి వెళ్ళి గుంతలు త్రవ్వి వస్తూ ఉంటాడు. పొలానికి వెళ్ళిన తర్వాత తన యంత్రం నుండి మోటార్ సైకిల్‌ను విడదీసి, ఆగర్ యంత్రాన్ని తోసుకుంటూ వెళ్ళి గుంతలను తీసన్తూ ఉంటాడు. రోజుకు సునాయాసంగా 300 పైగా గోతులను తీయవచ్చు. కాస్త బలమైన వ్యక్తి అయితే 500 వరకు కూడా తీయవచ్చు అంటాడు హమీద్ పాషా.

పెద్ద పెద్ద ట్రాక్టర్లకు అమర్చిన ఆగర్‌లకు ధీటుగా ఈ మోటార్ సైకిల్ ఆగర్ చక్కగా పని చేస్తోంది. ఒక గొయ్యి ఒక అడుగు వ్యాసంలో, 3 అడుగుల లోతు వరకు తీస్తుంది. అలా తాను తయారు చేసుకున్న ఆగర్ తో తన పొలంలో గోతులు త్రవ్వుకుని తాను అనుకున్న చెట్లు నాటాడు. ఇతని పని తనాన్ని చూసి, సమీప రైతులు కూడా తమ పొలాల్లో ఈ యంత్రంతోనే గోతులు తీయించుకున్నారు. ప్రస్తుతం తన ఆగర్‌ను తన సమీప బంధువులను అప్పజెప్పి తాను మాత్రం తన కార్పెంటర్ వృత్తి చేసుకుంటూ ఉన్నాడు. ఇప్పుడు తన వృత్తిపరంగా వచ్చే డబ్బుతో పాటు, ఆగర్ వల్ల కూడా కొంత ఆదాయం సమకూర్చుకుంటూ ఆనందంగా జీవనం కొనసాగిస్తున్నాడు.

ప్రస్తుతం రైతులు తమ పొలాలకు ఫెన్సింగ్ వేసుకునేందుకు మనుషులను పెట్టి రాతి స్తంభాలను పాతాల్సిన అవసరం లేకుండా ఈ ఆగర్‌తోనే పని చేయించుకుంటున్నారు. పందిరి వ్యవసాయం చేయాలి అనుకునే రైతులు ఈ ఆగర్‌తోనే పొలంలో గోతులు త్రవ్వించుకుని తక్కువ ఖర్చుతో పందిరి వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ ఆగర్‌తో ఒక్కో గొయ్యికి 60 రూపాయల వరకు తీసుకుంటున్నాడు హమీద్. అంటే మనుషులతో తీసుకునే గొయ్యికన్నా 40 శాతం తక్కువ ఖర్చుతో, చాలా తక్కువ సమయంలో తమ పని కావటంతో రైతులు కూడా సంతోషంగా దీనితో పని చేయించుకుంటున్నారు. పంట పొలంలో అయినా సరే ఇది మోటార్ సైకిల్ కాబట్టి పంటకు ఎటువంటి నష్టం జరగకుండా పొలంలోకి వెళ్ళి వారికి అవసరమైన గోతులు త్రవ్వి వస్తున్నాడు.

తన పొలంలో గుంతలు త్రవ్వటానికి 7 లక్షలు ఖర్చు అవుతుందని భావించి తానే స్వయంగా ఆగర్ తయారు చేసుకోవటం వల్ల దాన్ని తయారు చెయ్యటానికి ఒకటిన్నర లక్ష ఖర్చయింది. ప్రస్తుతం దీని ఖరీదు 1 లక్షా 80 వేల వరకు అవుతుందని అవసరమైన వారికి బయానాగా ఇస్తే మోటార్ సైకిల్‌తో సహా లక్షా ఎనభై వేలకు తయారు చేసి ఇస్తానని అంటున్నాడు. దీన్ని తయారు చేసి ఒక నెల రోజుల్లోనే సరఫరా చేసిస్తాను అంటున్నాడు హమీద్ పాషా. ప్రస్తుతం ఉద్యాన తోటలు, పొలాలకు కంచెలు వేసుకునే రైతుల సంఖ్య బాగా పెరిగింది కాబట్టి గ్రామాల్లోని యువకులు దీన్ని ఏర్పాటు చేసుకున్నట్లయితే తమ ఊర్లోనే లాభసాటి ఉపాధి పొందవచ్చు, రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించవచ్చు.

గ్రామాల్లోని యువకులు హమీద్ పాషా తయరు చేసిన మోటార్ సైకిల్ ఆగర్‌తో మంచి స్వయం ఉపాధిని తమ గ్రామాల్లోనే పొందుతారని ఆశిస్తోంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ హమీద్ పాషా, ఫోన్ : 90596 79595**





'పల్లెసృజన' ఆధ్వర్యంలో జరిగిన

# 51వ చిన్న శోధయాత్ర - యాత్రీకుల అనుభూతులు



'పల్లెసృజన నిర్వహిస్తున & 51వ చిన్న శోధయాత్ర 17-19 జనవరి, 2025 తేదీలలో వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి నుండి సర్పన పల్లి చెరువు వరకు నిర్వహించ బడింది. ఈ యాత్ర 17 జనవరి న అనంతగిరి, కేరెల్లి, ధరూర్, దోర్నల్ గ్రామాలు, 18 జనవరి న నాగారం, ఎవమికుర్తు, బర్కత్‌పల్లె, నస్కల్ మీదుగా, 19 జనవరిన దాచారం గుండా సాగి సర్పనపల్లి చెరువు వద్ద ముగిసింది. ఈ యాత్రలో పాల్గొన్న కొందరు యాత్రీకులు తెలియజేసిన తమ మనోభావాలు ఈవిధంగా ఉన్నాయి. - ఎడిటర్

**అక్షయ్ కుమార్,** మై స్టార్టప్ టీవీ :

చిన్న శోధయాత్ర అనుభవం నాకు ఎంతో గొప్పగా అనిపించింది. మొదటిరోజు నాకిప్పుడు పల్లెసృజన అంటే ఏమిటో అర్థం కాలేదు. ఆ తర్వాత సాయంత్రం తర్వాత అవగాహనకు వచ్చింది. పల్లెసృజన అంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆవిష్కరణలను గురించి. ఒక కష్టం మాత్రం ఉంది, రోజుకి 18-20 కిలోమీటర్లు నడవడం. కానీ మా సహ యాత్రీకులతో మాట్లాడుతూ, వాళ్ళ నుండి జ్ఞానం పొందడం చాలా ఆసక్తికరంగా అనిపించింది. నడక కూడా అలానే సరదాగా మారిపోయింది.

రెండవ రోజు ఉదయం ఎగ్జిబిషన్ మామూలుగా కాదు బాగా నచ్చింది. పాఠశాల పార్ట్ నాకు బాగా హిట్ చేసింది. నా పాత స్కూల్ డేస్ గుర్తుకొచ్చాయి. పిల్లలు ఎంత ఎగ్జైటింగ్‌గా ఉన్నారో, ఎంత చురుకుగా ఉన్నారో చూడటం చాలా సంతోషం అనిపించింది.

చివరి రోజు భోజనాలు 'లేక్ వ్యూ' లో జరిగింది. ఆ అనుభూతి మాటల్లో చెప్పలేదు.

చిన్న శోధయాత్రకి రావడం నాకు ఒక వరమైంది కదా !

**దత్త కిరణ్:**

నా చిన్న 51వ శోధయాత్ర అనుభవాలు....

**మొదటి రోజు : ప్రారంభం మరియు సవాళ్లు ;**

- వికారాబాద్‌లో ఐదుగురు సహ యాత్రీకులతో కలిసి చేరాను. ఇది నా రెండో యాత్ర కావడం వల్ల పరిచయం ఉన్న భావన ఒక మోతాదు వరకు అనిపించింది. ఇప్పుడే నేను వైరల్ ఫీవర్ నుండి బయటకు వచ్చాను. అయినా ఎలాంటి ప్రత్యేక అంచనాలు లేకుండా ముందుకు సాగాను.
- గ్రూప్‌తో ఫార్మల్ పరిచయాలు చాలా ఆసక్తిగా అనిపించాయి. బ్రిగేడియర్ పరిచయం గ్రామీణ ఆవిష్కరణలపై ఒక కొత్త దృష్టిని ఇచ్చింది.
- మొదటి రోజే 20 కి.మీ. పైగా నడవడం ఒక పెద్ద అఛీవ్‌మెంట్. ఓఆర్ఎస్ ద్వారా ఫిట్‌నెస్ మెయింటైన్ చేయగలిగాను.
- వికారాబాద్ కన్జర్వేషన్ ఏరియా అందమైన ప్రకృతి అందాలను చూపించింది. సహ యాత్రీకులతో చర్చలు జరుపుతూ, వారి విభిన్న ఆలోచనలను తెలుసుకోవడం ఎంతో బాగుంది.
- రైతుల దృక్పథంలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపించింది. వంటల వైవిధ్యం, నూతన సాగు వద్ధతులను చూసి ఆశ్చర్యపోయాను.
- చర్చలు ప్రధానం ఎఐ, వలసలు, కార్పోరేటిజం, పెళ్ళిళ్లు వంటి థీమ్స్ చుట్టూ తిరిగాయి.
- బ్రిగేడియర్ గారి ప్రసంగాలు, కథనాలు జీవితపు ప్రాథమిక అవసరాలపై అవగాహన పెంచాయి. సరళత మరియు ఆవిష్కరణల పట్ల గాఢమైన అభిమానం పెరిగింది.

**రెండో రోజు : సంబంధాలు మరియు ప్రేరణ :**

- పాఠశాలలో పడక, గ్రామస్తులతో, అనుభవజ్ఞులైన యాత్రీకులతో పరిచయాలు బాగా అనిపించాయి.
- గ్రామాల్లో గృహాలను సందర్శించి, పల్లెసృజన గురించి చర్చించడం గొప్ప అనుభూతి ఇచ్చింది.



- మిగతా యాత్రీకులతో బంధం పెరిగింది.
- ప్రేరణాత్మక వ్యక్తుల కథలు వినడం ద్వారా నాలో కాన్ఫిడెన్స్, పాజిటివ్ ఎనర్జీ పెరిగింది. అయితే కొంతమంది ఎదుర్కొంటున్న సవాళ్లు విని జాలి, మమకారం పెరిగాయి. అనిపించింది. అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదములు.
- సంభాషణలలో 'ప్రతిస్పందన' మరియు 'సమానాంతరం' లాంటి సానునకూలతలను ఉపయోగించాను.
- బ్రిగేడియర్ గారి మాటలు, కథల ద్వారా వివరణ అద్భుతమైంది.
- 'ఇన్‌స్పైర్', 'ఇగ్నైట్' వంటి ప్రాజెక్టుల గురించి తెలుసుకొని కొత్త ఆలోచనలు కలిగాయి.
- మీడియా వ్యక్తులతో మాట్లాడడం ద్వారా వారి ప్రత్యేక జీవన శైలిపై అవగాహన వచ్చింది.
- శ్రీశైలం వాడాను కానీ దాని ప్రభావంపై ఇంకా స్పష్టత రాలేదు.

**మూడవ రోజు – ఆలోచనలు మరియు కొత్త ఆవిష్కరణలు :**

- ఆ రాత్రి చాలా చలి. నిద్ర కూడా అంతగా లేకపోయినా, రోజు కొత్త మైలురాళ్ళను తాకింది. నా మొదటి వీడియో రికార్డు చేయడం ఒక ఎగ్జయిటింగ్ అనుభవం.
- పట్టణ యాత్ర, రైతు నుండి నేరుగా కుటుంబానికి (ఫార్మర్ – టు – ఫ్యామిలీ) వ్యవహారాలు చేయడం, ఫామ్ ప్లాట్లు కొనడం, పెర్మాకల్చర్ ఆధారిత స్వయం సమృద్ధి పద్ధతుల ఏర్పాటు చేయడం వంటి ఐడియాలు నా మనసులో మెదిలాయి.
- ఏ విషయాన్నైనా తీర్పు ఇవ్వక ముందు వివిధ కోణాల నుంచి వాదనల్ని సేకరించాల్సిన అవసరం ఉందని నేర్చుకున్నాను.
- బ్రిగేడియర్ గారి దృష్టి కోణం ప్రత్యామ్నాయ నైపుణ్య అభివృద్ధి, నాయకత్వం పట్ల ప్రేరణ నచ్చింది.
- వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఇతర యాత్రీకుల నుండి విలువైన పరిజ్ఞానం అందుకుంది.
- వ్యవసాయంపై నా దృష్టికోణం మారింది. ఆటోమేషన్ మీద ఆధార పడకుండా, సుస్థిరమైన స్వతంత్ర వ్యవసాయ మోడల్స్ వైపు మెరుగైన దృష్టిని అభివృద్ధి చేసుకున్నాను.

**ముగింపు భావనలు :**

51వ చిన్న శోధయాత్ర నాకు ఒక అద్వితీయమైన అనుభవం ఇచ్చింది. ఆరోగ్యం, జ్ఞానం, అభివృద్ధి, సంబంధాల పరంగా ప్రతి క్షణం నా విజన్‌ను విస్తరించే అవకాశంగా మారింది. బ్రిగేడియర్ గారి



నాయకత్వం, యాత్రికులతో కలిసి గడిపిన అనుభవాలునా వ్యక్తిగత మరియు వృత్తిపరమైన జీవితంలో ఆలోచింపజేసేలా, ప్రేరణ ఇచ్చేలా చేశాయి.

**ఎల్. వెంకటేష్,** టి–వర్క్స్ ఫౌండేషన్, హైదరాబాద్ :

51వ చిన్న శోధయాత్ర నాకు అమూల్యమైన అనుభవాన్ని ఇచ్చింది. ఇది గ్రామీణ జీవితాన్ని లోతుగా అర్థం చేసుకునే అవకాశం కల్పించింది. గ్రామస్తులతో మాట్లాడుతూ, వారి నిత్య జీవితం, వారు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి నేర్చుకున్నాను. పరిమిత వనరులతో కూడా సౌకర్యవంతమైన జీవితం గడపడానికి వారు చూపుతున్న సృజనాత్మకతను చూసి ఆశ్చర్యపోయాను. ఈ అనుభవం స్థిరమైన జీవన పద్ధతుల ప్రాముఖ్యతను మరియు సముదాయ సహకారం ఎంత కీలకమో మళ్ళీ గుర్తు చేసింది.

యాత్రలో ఒక ముఖ్యమైన అంశం – రైతులకు వినూత్న సాగు పద్ధతులను పరిచయం చేయడం రైతులు తమ తోటి రైతుల నుండి కొత్త సాగు పద్ధతులను తెలుసుకొని, వాటిని అనుసరించడం ద్వారా వ్యవసాయ దిగుబడులు పెరగడం, జీవన ప్రమాణం మెరుగు పడటం జరిగింది.

ఈ జ్ఞాన మార్పిడి ద్వారా యాత్రికులు మరియు గ్రామీణ సముదాయాలు రెండూ లాభపడతాయి. ఈ యాత్ర పట్టణాలు మరియు గ్రామాలు పరస్పరంగా ఎలా అనుసంధానమై ఉన్నాయో గుర్తు చేసింది. గ్రామీణాభివృద్ధికి మద్దతు ఇవ్వడమెంత అవసరమో బాగా అర్థమైంది.









**డా. మొహమ్మద్ హుస్సేన్,** మాజీ ప్రొఫెసర్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్, గోకరాజు గంగరాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, హైదరాబాద్ :

నేను హృదయపూర్వకంగా పల్లెసృజన వ్యవస్థాపకులు బ్రిగేడియర్ గణేశం గారికి మరియు వారి టీంకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను. వారు ఇచ్చిన ఈ అవకాశం ద్వారా నేను గ్రామస్తులతో, దేశం నలుమూలల నుంచి సహృదయంతో, స్వార్థరహిత సేవాభావం తో వచ్చిన యాత్రీకులతో మమేకమయ్యాను.

పల్లెసృజన తన నలుగురు గురువులను – ప్రకృతి, గ్రామస్తులు, సహ యాత్రీకులు మరియు తాము తానే అద్భుతంగా వివరించింది. ఇది గోడల మధ్య జరిగే విద్యను మించి, జీవితాన్ని అనుభవించి నేర్చుకునే విద్య. ఇది మానవుడు ప్రకృతితో కలిసి కట్టుగా జీవించే జీవన శైలిని ప్రత్యక్షంగా చూపించే అరుదైన అవకాశం.

నేటి 'డిజిటల్ లైఫ్'లో ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల వినియోగం పెరుగుతూ, జీవన శైలిలో వచ్చే రుగ్మతల మధ్య ఇలాంటి యాత్రలు మన ఆరోగ్యాన్ని (శారీరక, మానసిక, సామాజిక) మళ్ళీ గుర్తు చేస్తూ, పునరుజ్జీవనానికి దారితీస్తాయి. ఈ రెండు రోజుల యాత్రలో నేను నిజమైన రిఫ్రెష్‌మెంట్‌ని అనుభవించాను.

**యాత్రలో నేను నేర్చుకున్న ముఖ్యమైన పాఠాలు :**

1. ప్రతి గ్రామీణ ఆవిష్కరణ పుట్టుక దాని బాధను గుండెనిండా భావించడమే (అఫెక్టివ్ డొమైన్ అభివృద్ధి).
2. రైతులు వినియోగదారులు కాదు, ఆహార సృష్టికర్తలు. వారిని సాధికారంగా చేయడం అవసరం.
3. గ్రామాల్లో రైతుల కోసం రూపొందించిన ఆవిష్కరణల ప్రదర్శనలు గమనించాను. రైతులకు ఈ ఉత్పత్తులను సరసమైన ధరకే అందించాల్సిన అవసరం ఉంది.
4. వయస్సు 90 దాటి ఉన్న వృద్ధులు చిన్నప్పుడు సిరి ధాన్యాలను (మిల్లెట్స్) ఆహారంగా తీసుకున్నారని చెప్పారు. మన రోజువారీ భోజనంలో మిల్లెట్స్‌ను తప్పనిసరిగా చేర్చుకోవాలి.
5. ఉదయాన్నే నడక చాలా ప్రభావవంతమైన వ్యాయామం.
6. ఇలాంటి ఫీల్డ్ యాత్రలను అన్ని విశ్వ విద్యాలయాల బి.టెక్ ప్రోగ్రాంలో భాగం చెయ్యాలి. పల్లెసృజన, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వెబ్‌సైట్లు ఎంతో విలువైన సమాచారం అందిస్తున్నాయి.
7. ఇమాజినేటివ్ రైట్ బ్రెయిన్ అభివృద్ధి – పరిధి విస్తరించడం మరియు ఫీల్డ్ అనుభవాల ద్వారా అభివృద్ధి చెందుతుంది.
8. సిస్టమ్ థింకింగ్ (వ్యవస్థాపక ఆలోచన) – సమగ్ర విజ్ఞానానికి అవసరం.

**ముగింపు :**

ఈ యాత్ర నాకు వ్యక్తిగతంగా మరియు మేథోపరంగా గొప్ప అనుభూతిని, కొత్త ఆలోచనలను అందించింది. బ్రిగేడియర్ గణేశం గారి నేతృత్వం మరియు సహ యాత్రీకుల అనుభవాలు నా జీవితాన్ని మళ్ళీ ఒక కొత్త దిశలో ఆలోచించేందుకు ప్రేరణ ఇచ్చాయి.

**వివిఎన్‌కె తేజ వర్మ, ఎస్ :**

**గురు – 1 (ప్రకృతి) :**

- అనంతగిరి నుంచి ప్రయాణం మంచి ప్రారంభం జరిగింది. మన చుట్టూ ఉన్న పచ్చదనం మనోభావాన్ని సానుకూలంగా మార్చింది.
- మూడు రోజుల యాత్రా సమయంలో వైవిధ్యమైన పంటల మంచి నేర్చుకోగల అనుభవాన్ని ఇచ్చాయి. అంజిరెడ్డి గారికి, పంటలు మరియు మొక్కల గురించి ఆయన ఇచ్చిన విశాలమైన జ్ఞానం కోసం నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

**గురు – 2 (గ్రామస్తులు) :**





❀ **కృష్ణ (అనంతగిరి) :** సైకిలుతో ప్రయాణిస్తున్న ఒంటరి ప్రస్థానికుడు, కత్తులను పదును చేసే వృత్తిలో బిజీగా వున్న కృష్ణ యొక్క కథ చాలా ప్రేరణదాయకంగా ఉంది. సాదా జీవితం గడిపినా, ఆయన ఎప్పుడూ కోపించడు. తన నైపుణ్యాలపై నమ్మకం ఉంచుకొని, తన జీవనాధారాన్ని నిర్వహించి, ఏ పనైనా చేసుకోగలడు. అతని ప్రగతిలోనూ చాలా మాటలు నేర్చుకోవచ్చు.

❀ **అంతయ్య (రైతు, కెరెల్లి) :** 73 సంవత్సరాల వయసుమళ్ళిన రైతు. ఒకప్పుడు సహజ వ్యవసాయం చేసిన ఆయన పాఠశాల విద్య లేకపోయినా, భూమిపట్ల వున్న సుదీర్ఘ అనుభవం ఆయనకు మద్దతుగా ఉంటుంది. అతను చాలా ఉత్కృష్టంగా అతని ఆలోచనలు పంచాడు. ఉదాహరణకు సూర్యుడు ఉదయిస్తున్న సమయంలో నీరు త్రాగడం ముఖ్యమని చెప్పాడు.

❀ **లక్ష్మి (కూరగాయల వ్యాపారి, దోర్నల్) :** సాధారణ, సరళమైన కూరగాయలు అమ్మే లక్ష్మి తన పరిస్థితులపై ఎప్పటికీ వాపోయేలా లేదు. ఆమె తన రైతు వ్యవసాయం నుండి వచ్చే ప్రతి పంటతో జీవిస్తుంది మరియు తన పిల్లలను పాఠశాలకి పంపిస్తుంది.

❀ **హరినాథ రెడ్డి (రైతు, దోర్నల్) :** బి.ఏ. గ్రాడ్యుయేషన్ చేసిన యువకుడు. సహజ వ్యవసాయాన్ని తన భూమిలో ప్రయోగిస్తున్నాడు. అతను మాత్రం యువతను రైతు పనులకు ప్రోత్సహించాలి అనుకున్నాడు. ఎందుకంటే పునరావృత పని చేస్తే ఇతర పనులు చేసే మనుషులు అవసరం పడతారు.

❀ **రాజు (రైతు & ఒక సామాన్యమైన ఆవిష్కర్త) :** రైతు రంగంలో ఒక ఆవిష్కరణ చేసిన వ్యక్తి. అతని నమూనా ప్రస్తుతం పల్లెసృజన ఆవిష్కరణకు దగ్గరగా ఉన్నా, అతని ఆవిష్కరణ చూడటానికి చాలా ఉత్సాహంగా అంది. అతను 20 లీటర్ల నీటి క్యాన్ ఉపయోగించి, పైపు మరియు బటన్ మెకానిజం ఏర్పాటు చేసుకున్నాడు.

❀ **గుర్తించని/ మర్చిపోయిన పేరు (రైతు, గొట్టిముక్కల) :** పెరిగిన ఎరువుల ధరల కారణంగా ఈ రైతు మరి కొందరు సహజ వ్యవసాయానికి మారిపోయారు. 15-20 సంవత్సరాల క్రితం రోజుల్లో గ్రామీణులు వ్యవసాయం చేసేవారు మరియు రాత్రి బడులలో చదువుకునేవారు. ఇప్పుడు వారు సంతృప్తిగా కొన్ని డిగ్రీల సబ్జెక్టులను పూర్తి చేసారు.

**గురు – 3 (సహ యాత్రికులు) :**

❀ ప్రేరణ ఇచ్చే మరియు అనుకూలంగా ఉన్న సహ యాత్రికులు, విస్తృత విషయాలపై మాతో తమ జ్ఞానం పంచుకున్నారు.

❀ నాలాంటి చొరవ లేని యాత్రికుడు, ఈ యాత్రలో నా సహ యాత్రికుల ఉత్సాహం వల్ల చాలా మందినుండి మంచి అనుభవాలను పొందగలిగాను.

❀ సులభమైన వనరులను పంచుకోవడం, ఉదాహరణకు నివాసం మరియు నీరు, మాకు వనరుల నిర్వహణ మరియు సహకార విలువను నేర్పింది.

**గురు – 4 (నాకు నేను) :**

❀ నేను ఈ యాత్రకు పెద్ద ఆశతో రాలేదు, కానీ ఇప్పుడు నాకు లభించిన అనుభవాలు ఎప్పటికీ నా హృదయంలో నిలిచి ఉంటాయి. ప్రత్యక్ష అనుభవం ఆన్‌లైన్ నుండి చాలా అనుభవం.

❀ మల్లేశం కథ చాలా ప్రేరణదాయకంగా ఉంది (నేను ఇప్పటికే చిత్రం చూసి ఉన్నాను). ఈ కథ పూర్తిగా వినడం నాకు అతని ఇబ్బందుల గురించి మరింత లోతైన అవగాహన వచ్చింది. అతను తన ఆవిష్కరణ కోసం కోడింగ్ నేర్చుకోవడం చాలా మనోజ్ఞంగా అనిపించింది.

**సారాంశం :**

ఈ యాత్ర అనేక విషయాల నుండి నేర్చుకున్నాను. ప్రకృతి ప్రేరణ ఇచ్చే ప్రజలు మరియు సహ యాత్రికుల నుండి అనుభవాలు ఇవన్నీ నాకు సుదీర్ఘ కాలం గుర్తుండిపోతాయి. ఈ యాత్ర నాకు సహనాన్ని , సుస్థిరతను, జీవితంలోని సరళమైన విషయాలను అర్థం చేసుకోవడం నేర్పింది, దారుణాలను చూపించి జాగ్రత్త వహించేలా చేసింది.

**జ్యోతిర్మయి :**

60 కి.మీ.... 3 రోజులు.... అనేక పాఠాలు....

గ్రామాల హృదయాల్లో నడుస్తూ, నేను కేవలం అందమైన దృశ్యాలు మాత్రమే కాకుండా కథలు, ప్రతిఘటన, అనుకోని చోట్ల పటిష్ఠంగా వికసిస్తున్న ఆవిష్కరణలను కూడా కనుగొన్నాను. సహ యాత్రికులతో సంభాషణ ఒక ప్రత్యేకమైన దారి, అక్కడి అవసరం, సృజనాత్మకతకు శక్తినిస్తుంది. మరియు సాంప్రదాయ పురోగతితో కలిసి నడుస్తుంది.

సాధారణమైన తెలివైన పరిష్కారాలు, సమూహ ఆధారిత సుస్థిరత ఈ ప్రయాణం నాకు గుర్తు చేసిందేమిటంటే.... నిజమైన విజ్ఞానం, తరచుగా పల్లెల్లో ఉంటుంది. కలిసిన అనుభవాలు, నేర్చుకున్న పాఠాలు, ప్రపంచం లోని పెద్ద సవాళ్ళకు పరిష్కారాలు... చాలా చిన్నగా నేరుగా పాదాల వద్ద ప్రారంభమవుతాయని నేను మళ్ళీ తెలుసుకున్నాను.



**హరిబాబు శ్రీరామోజు:**

నేను ఈసారి పల్లెసృజన బృదం నిర్వహించిన 51వ చిన్నశోధ యాత్రలో పాల్గొన్నాను. యాత్ర మొదలు పెట్టేముందు నా ఆలోచన చాలా పరిమితంగా ఉంది. గ్రామస్తులను కలవడం, గ్రామీణ ఆవిష్కరణల గురించి వారికి వివరించడం మాత్రమే అని భావించాను. కానీ, యాత్ర ప్రారంభమైన వెంటనే అర్థమైంది ఇది ఎంత అద్భుతమైన, సంపూర్ణమైన దృక్పథంతో రూపొందించ బడిందో.

**ఈ యాత్ర నాకు :**

- ప్రకృతిని దగ్గరగా అనుభవించే అవకాశం,
- సహ యాత్రికులతో మమేకమయ్యే అవకాశం,
- గ్రామస్తులతో చర్చలు సాగించే అవకాశం ఇచ్చింది.

50 కి.మీ. పైగా నడవడం ద్వారా 7 గ్రామాలకు పైగా చూసే అవకాశం లభించింది. నడుచుకుంటూ కొత్త స్నేహితులను కలవడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం, ప్రకృతిని గమనించడం, మార్గ మధ్యలో ఎదురయ్యే గ్రామస్తులతో మాట్లాడటం... ప్రతి చిన్న సంఘటన లో ఎంతో సానుకూలత కనిపించింది. ఇలాంటి మానసిక దృక్పథం కలిగిన వారితో గడిపిన ప్రతి క్షణం నాకు కొత్తదనం నేర్పింది. ఎంత తక్కువ వనరులతో జీవనాన్ని నడిపించ గలమో గ్రామస్తుల దగ్గర నేర్చుకున్నాను. గ్రామీణ ప్రజలు, పిల్లలు చూపించిన ఓపెన్‌నెస్, శ్రద్ధ మరియు జిజ్ఞాస నన్ను ఆశ్చర్యపరిచింది.

బ్రిగేడియర్ గణేశం గారు మరియు వారి టీమ్‌ను కలవడం నాకు గర్వంగా అనిపించింది. వారి సాదా సీదా నడవడిక, లక్ష్య సిద్ధత, గ్రామీణ ఆవిష్కరణలను ప్రోత్సహించే తపన చూసి ఎంతో ముచ్చట వేసింది. ఈ యాత్రలో పొందిన అనుభవం వల్ల భవిష్యత్తులో జరిగే యాత్రల్లో కూడా తప్పక పాల్గొనాలని, ఇంకా పల్లెసృజన బృందంతో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నాను.

**నిర్మిత:**

**1వ రోజు : అన్వేషణ యాత్ర :**

నేను మొదటగా బ్రిగేడియర్ తాతగారిని పల్లెసృజన గురించి అడిగే వరకు, నాకు దాని గురించి ఏమీ తెలియదు, ఏమీ అర్థం కాలేదు. ఆ వివరాలను వివరించమని అడిగితే, ఆయన నాకు స్వయంగా నేర్చుకోవాలని, నా సహ యాత్రికులతో మాట్లాడాలని ప్రేరేపించారు. మొదట ఆయన దృక్కోణాన్ని అర్థం చేసుకోలేక పోయాను కానీ, ప్రయాణం ప్రారంభం అయినప్పుడు నేను దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నాను.

ఈ యాత్ర 40 మంది వ్యక్తులను కలిపింది. ప్రతి ఒక్కరూ జీవితం, పెళ్ళి, మరియు అనేక అనుభవాలపై తనదైన దృక్కోణం ఉన్న వారు. ఈ సంభాషణలు నాకు 40 వేర్వేరు దృష్టి కోణాలను అందించాయి. అదేరోజున నేను ఎమరాల్డ్ స్వీట్ షాప్ యొక్క వ్యవస్థాపకుడిని బ్రిగేడియర్ తాతతో మాట్లాడుతుండగా చూశాను. ఆ క్షణం నాకు సామాన్య తాత్వికతను అర్థం చేసుకోవడంలో సహాయ పడింది. తాతగారు దానికి ఎందుకు ప్రాధాన్యత ఇస్తారో నాకు అప్పుడర్థమైంది.

**ప్రకృతితో నేర్చుకోవడం :**

అంజిరెడ్డి గారు మాతో కలిసి నడిచారు. ప్రతియొక్క చెట్టు గురించి గమనించాల్సిన వివరాలను బాగా చెప్పారు. ఆయన మాటలు ప్రకృతిలోని స్వచ్ఛమైన ధాతృత్వాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలో చెప్పారు. ఈ పాఠం నన్ను ఎప్పటికీ ప్రభావితం చేస్తుంది.

**అనుభూతి మరియు దయ :**

రెండవరోజు నేను నడకలో వెళ్ళడానికి కష్టపడుతున్నాను. నా శక్తిని పూర్తిగా సమీకరించుకుని సాగిపోతున్నాను. ఎలా గమనించారో బ్రిగేడియర్ తాతగారు నా అలసటను గమనించి, దయతో నాకు విశ్రాంతి తీసుకోవాలి, ఎక్కువగా బలవంతంగా యాత్ర చేయవద్దని సూచించారు. ఆ క్షణం నాకు నాయకత్వంలో మరియు జీవితంలో అనుభూతి యొక్క ప్రాముఖ్యతను నేర్పింది. గ్రామాలలో మేము కనుగొన్న సహృదయత నాలో చాలా హృద్యాన్ని నింపింది. వారి పరిమిత వనరులతో వారు మనకు అందించే అత్యుత్తమమైన వసతులు, స్వీట్లతో ఆతిథ్యాన్నిచ్చారు.

**బాంధవ్యాలు - భావాలను పంచుకోవడం :**

ప్రయాణం అనుకోకుండా మమ్మల్ని కలపడం జరిగింది. సహ యాత్రీకుల అనుభవాలు, సంభాషణలు, నిగూఢమైన అర్థాలు, కొత్త స్నేహితులు ఏర్పడటానికి దారితీశాయి. గ్రామీణ జీవితం, వారి జీవనాధారాలను ప్రత్యక్షంగా అనుభవించడం, అవగాహన చేసుకోవడం మధురమైన అనుభూతులను మిగిల్చింది. ప్రగాఢమైన అనుభవాన్ని ఇచ్చింది.

**చిన్న శోధయాత్రపై ఆలోచనలు :**

చిన్న శోధయాత్ర కేవలం ఒక అధికారిక పర్యటన కాదు. ఇది ఒక మార్పును సృష్టించే అనుభవం. శారీరక సవాళ్ళు ఎదురైనప్పటికీ ఇది సాహసోపేతాన్ని, విలువలను తెలుసుకునేలా చేసింది. నా జీవితంలో నేను ఎప్పటికీ పాఠాలుగా నేర్చుకోవటం నేర్పింది. ముఖ్యంగా ఇది నాకు ఒక మార్గదర్శకుడు మరియు ఉపాధ్యాయుడు అయ్యింది. అంటే బ్రిగేడియర్ తాతగారు నేను ఎప్పటికీ కోరుకునే వ్యక్తి. ఈ మూడు రోజులు గ్రామీణ జీవనం మనల్ని అత్యంత ప్రామాణికంగా తీర్చి దిద్దింది.

**లావణ్య :**

**చిన్న శోధయాత్ర-51 ఆశ్చర్యాలు మరియు మనోభావాలు :**

యాత్రలో మొదటిరోజు మేమందరం ఆలయం దగ్గర గుమికూడినప్పుడు మమ్మల్ని ఒకరినొకరు పరిచయం చేసుకోమని, ప్రయాణం కోసం మీ అంచనాలను పంచుకోమని చెప్పారు. నావంతు వచ్చినపుడు గ్రామీణ ప్రాంతాలను అన్వేషించడం, చిన్న శోధయాత్ర యొక్క ప్రత్యేకమైన భావనను అర్థం చేసుకోవాలి అనుకుంటున్నట్లు చెప్పాను. బ్రిగేడియర్ నవ్వుతూ "మీకు చాలా ఆశ్చర్యకరమైనవి వస్తున్నాయి....!! అన్నారు. వారు చెప్పినట్లుగానే మా ప్రయాణం చాలా



ఆశ్చర్యకరమైన, అంతర్ దృష్టితో కూడిన, ఆలోచింపజేసే పాఠాలతో సాగింది.

**ఆశ్చర్యం-1:**

రెండవ రోజు అద్భుతమైన విషయం బయట పడింది! తెల్లవారుఝామున చంద్రుడు అస్తమించడం నేను చూశాను. మేము రోజంతా ఆకాశం క్రింద గడిపినపుడు, సూర్యోదయం, సూర్యుడు పైకి ఎక్కడం, సూర్యాస్తమయం మళ్ళీ చంద్రుడు ఉదయించడం చూడగలిగాను. అది నన్ను ఆశ్చర్య పరిచింది. ఒకేరోజులో ఆకాశంలో సూర్య చంద్రుల ప్రయాణాన్ని నేను మొదటిసారి చూశాను. ఇది ప్రకృతి ఏర్పాటు చేసిన అద్భుతమైన ప్రత్యేక ప్రదర్శనలా అనిపించింది.

**ఆశ్చర్యం-2:**

మేము అడవిగుండా ప్రయాణిస్తుండగా అసాధారణమైన విషయాలను గమనించాము. అడవి మధ్యలో ఎండిన ఆకులను ఊడ్చి సేకరిస్తున్న మహిళలను చూసి ఆసక్తిగా వారి వద్దకు వెళ్ళి "మీరు ఇక్కడ ఈ దుమ్ము, ఆకులను ఎందుకు ఊడ్చుతున్నారు?" అని అడిగాము. వారి సమాధానం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. మొత్తం లారీలో నింపడానికి ఆకులను సేకరిస్తున్నామని వారు చెప్పారు. ఎందుకు? అని అడగగా "ఎందుకంటే ఒక సినిమా నిర్మాణ సంస్థకు ఒక సినిమాలోని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం అవి అవసరం." అన్నారు. అడవి దారిలో నడక సినిమాలు ఎలా తీస్తారు అనే దాని గురించి ఇంత ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయని ఎవరు ఊహించారు?

**ఆశ్చర్యం-3:**

మూడు రోజుల్లో పల్లెసృజన లోని కొంతమంది చురుకైన వాలంటీర్లతో కలిసి నడిచే అవకాశం నాకు లభించింది. సమయ పరిమితుల గురించి ఫిర్యాదు చేయకుండా చురుకుగా స్వచ్ఛందంగా పని చేయడం, ఇంకా చాలా వినయంగా మరియు నిక్కచ్చిగా ఉండటం తప్ప వారు చేస్తున్న ప్రభావవంతమైన పనిని చూసి నేను నిజంగా ఆశ్చర్యపోయాను.

**అంజిరెడ్డి గారు:**

నేను అనారోగ్యానికి గురైనప్పుడు నా మొదటి ఆలోచన ఎప్పుడూ "దగ్గరలో ఫార్మసీ ఎక్కడ ఉంది?" అనుకుంటాను. అదే అంజిరెడ్డి సార్ అయితే అనారోగ్యాన్ని నయం చేసే మ్యాజిక్ ప్లాంట్ కోసం సమీపంలోని ప్రాంతాన్ని స్కాన్ చేస్తాడు. అతనితో సంభాషణ నన్ను ఆలోచింపజేసింది. బహుశా మనం ప్రకృతితో సహజీవనం నేర్చుకోవడం అంటే ఇదే కావచ్చు. మార్పు తీసుకు రావాలనే కోరిక మరియు సేంద్రియ విధానంపై ఆయనకున్న నమ్మకం ద్వారా అంజిరెడ్డి గారు ఒక ప్రత్యేకమైన భావనలో ఓపెన్ స్కూలు నడుపుతున్నాడు. మనం చూడటానికి కొంత సమయం తీసుకుంటే, ఆయన విధానాలు కొన్ని సార్లు సరళమైన, అత్యంత సహజమైన పరిష్కారాలు మనముందే ఉంటాయని గుర్తు చేస్తుంది.

**నాగమోహన్ గారు:**

అనాధ బాలికలకు విరాళం గురించి ఆలోచించినపుడు మనం సాధారణంగా బట్టలు, డబ్బు, శానిటరీ న్యాప్‌కిన్‌లు మొదలైన వాటిని గురించి ఆలోచిస్తాము. కానీ నేను నాగమోహన్ గారితో కలిసి నడుస్తున్నప్పుడు అనాధ బాలికలకు లో దుస్తులు అందించే ఎక్స్‌ట్రామైల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడిని అని ఆయన నాకు చెప్పారు. నేను వారి



మాటలు విని ఆశ్చర్యపోయాను. ఒక మహిళగా లో దుస్తులు లాంటి ముఖ్యమైన వస్తువులను కూడా దానం చెయ్యవచ్చు అని నాకెప్పుడూ అనిపించలేదు. ఆయన 2017 నుండి ఇలాంటి అద్భుతమైన పని చేస్తున్నారు. ఆయన అందించే మద్దతు 2017లో 100 మంది బాలికలకు సహాయం చేయడం నుండి 2024లో 800 మంది బాలికలకు పెరిగింది. మా సంభాషణ సమయంలో ఆయన అద్భుతమైన కథకుడు అని నేను గ్రహించాను. చమత్కారమైన వ్యక్తి, దాదాపు ఒక చిన్న త్రివిక్రమ్ (తెలుగు సినిమా దర్శకుడు & రచయిత) లాగా. ఆయన కథనం లో నాకు ఇష్టమైనది ఒకటి 'డక్ ఆర్ ఈగిల్ – యు డిసైడ్'. ఇది నిజంగా ఆసక్తికరంగా చదవదగినది.

**సాయికుమార్ గారు:**

ఒక ఉత్సాహభరితమైన సివిల్ సర్వీస్ ఆశావహుడు, ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుడు. విద్య, ఆవిష్కరణ మరియు సాంకేతిక శిక్షణా కార్యక్రమాలకుమద్దతు ఇచ్చే ఎన్‌జిఓలతో కలిసి పని చేస్తూనే, బాలల గృహాలకు కూడా తోడ్పడుతూ తన కఠినమైన పరీక్షలకు సన్నద్ధం అవుతూ ఉంటాడు. మా నడకలో ఎన్‌జిఓలతో కలిసి అతను చేస్తున్న అద్భుతమైన పని గురించి మేము చర్చించాము. ఇతరులకు సేవ చేయడంలో ఎవరైనా ఇంత మక్కువ మరియు శక్తి ఎలా కలిగి ఉంటారో అని ఆశ్చర్యపోకుండా ఉండలేక పోయాను.

**ఆశ్చర్యం - 4:**

మేము చాలాసేపు నడిచిన తర్వాత అంజిరెడ్డి గారు చేసిన ప్రసంగంలో.... ఈ రోజుల్లో కోళ్ల ఫారాలలోని కోళ్ళను నాలుగు నెలల పాటు భారీ ప్రకాశవంతమైన కాంతిలో పరిమిత/కదలిక లేకుండా ఎలా ఉంచుతారో ఆయన మాట్లాడారు. ఇది అవి పెరగడానికి అనారోగ్యకరమైన మార్గం. అది నన్ను ఆలోచింపజేసింది. కార్పోరేట్ ఉద్యోగాలలో కూడా కొన్నిసార్లు మనకు ఇలాంటిదేదో అనిపించడం లేదా? ఉద్యోగులు కొన్నిసార్లు రోజుకు 12-14 గంటలు పని చేస్తారు. గమ్యాలను చేరుకోవడానికి కనీస కదలికతో స్క్రీన్‌లను చూస్తూ ఉంటారు. దీనివల్ల వివిధ ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఆశ్చర్యంగా, దురదృష్టవశాత్తు, కఠినమైన కాంతి కింద రోజంతా కూర్చున్న కోళ్ళలా నేను అనుభూతి చెందాను. వాటి కళ్ళు మండుతుంటాయి, శరీరం నొప్పిగా ఉంటుంది. ఎందుకంటే మనం మానవులం కదా కంప్యూటర్ స్క్రీన్‌ల ముందు కూర్చొని గంటలు గడిపినప్పుడు మన కళ్ళు మరియు శరీరాలలో అదే నొప్పిని అనుభవిస్తాము. ఇది కేవలం రెండు వేర్వేరు

జీవులు, వేర్వేరు ప్రపంచాలలో ఇలాంటి పోరాటాన్ని పంచుకోవడం.

**ఆశ్చర్యం – 5 :**

చివరిది కానీ ముఖ్యమైనది. మా నాయకుడు బ్రిగేడియర్ గణేశం గారు 76 ఏళ్ళ యువకుడు. మా అందరిలాగే అదే దూరం నడిచినప్పటికీ, చాలామంది యాత్రికులకంటే ముందుగానే ఎలా మేల్కొంటాడో చూసి ఆశ్చర్యపోయాను. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అతను నడకల మధ్య ఒక్క నిమిషం కూడా కూర్చోలేదు సరికదా అన్ని సమయాలలో నిలబడి, ఆవిష్కరణల కథలను ఉద్వేగంతో పంచుకున్నాడు. వివిధ అంశాలను చర్చించాడు. కాళ్ళలో నొప్పి ఉన్నప్పటికీ అతన్ని ముందుకు నడిపించేది ఏమిటో ఆలోచిస్తే 'పల్లెసృజన' ద్వారా వారు చూసిన ప్రభావం, జ్ఞానాన్ని పంచుకోవడం పట్ల వారి లోతైన మక్కువ వారిని చాలాకాలం పాటు నడిచేలా మరియు నిలబడేలా చేస్తుందని నేను నమ్ముతున్నాను.

గణేశం గారితో ముఖాముఖి సంభాషణలు చిన్నశోధయాత్ర యొక్క ముఖ్యాంశం – చిరస్మరణీయమైనవి, అర్థవంతమైనవి మరియు నిజంగా విలువైనవి. గణేశం గారు అసాధారణ మార్గాన్ని ఎంచుకున్నందుకు ధన్యవాదములు. "తీసుకోని సహదారి" మరియు నిర్దేశించిన లక్ష్యాలు లేదా లక్ష్యాలు లేని స్వచ్ఛంద సేవకులచే నడిచే సమూహం (సంస్థ కాదు). ఇప్పటికీ ఇంత లోతైన ప్రభావాన్ని సృష్టించగలదని మాకు చూపినందుకు ధన్యావాదములు. చిన్న శోధయాత్రలో నాకు చాలా ఆశ్చర్య కరమైన విషయాలు, నేర్చుకున్న విషయాలు చాలా ఉన్నాయి. కానీ వాటిని మాటల్లో చెప్పలేను, అనుభవించాల్సిందే !!

**వంశీప్రియ మనోభావాలు:**

గత మూడు రోజులు హరి శివులతో కలిసి పల్లెసృజన వారి చిన్న శోధయాత్రలో మీవంటి ఆత్మ బంధువులతో సమయం గడపటం జీవన విద్యా సాధనకు సంబంధించి మరింత స్పష్టత ఏర్పడినట్లు అనిపిస్తోంది.

1. సమాన భావాలు కలిగిన వారితో మాట్లాడడం మనకు మనం ఒకరి భావాలు మరొకర పంచుకోవడం లాంటిది. ఇందులో పునరావృతం అవటానికి అవకాశమే లేదు. మావారు అన్నట్టు బంతి మనవరకు వస్తేనే కదా పట్టుకోవడానికి (రెస్పాండ్) లేదా విసిరి కొట్టడానికి (రియాక్ట్). కాబట్టి సాధన అద్భుతంగా జరగాలంటే మనలాంటి వారితో ఉంటే పెద్దగా ఉపయోగం లేదు. ఎంత వైరుధ్యమైన వారితో కలుస్తూ ఉంటే అంత త్వరగా అభివృద్ధి చెందుతాము. ఏమంటారు?

**అల్లకల్లోలమైన సముద్ర భావన అనుభవంలోకి వచ్చింది :**

2. పిల్లల ప్రవర్తన నాకు నచ్చినట్టు లేకపోతే ఇంట్లో అయితే కర్కశంగా, బయటి వారి ముందు అయితే పరువు పోతుంది కనుక అదుపు చేయడానికి శతవిధాలా ప్రశాంతంగా, సౌమ్యంగా ఉండే ప్రయత్నం చేసేదాన్ని. ఈసారి మాత్రం కర్కశత్వం – ప్రశాంతత రెండు తగ్గినట్టే





అనిపించాయి. వారికి నచ్చినట్టు వారు ఉండడాన్ని అంగీకరించినట్టే ఉన్నాను. లోపల కూడా బాయిల్ కాలేదండోయ్.

3. అవిరామంగా 3 రోజులు సహ యాత్రికులతో మాట్లాడుతున్నప్పుడు వారి ప్రతి సంశయానికీ, సమస్యకు జీవన విద్యే పరిష్కారం అని ఖచ్చితంగా అనిపించింది. నేనెప్పుడూ మంచి దారినే ఎన్నుకుంటాను కదా మరి. అంతే కాకుండా కేర్ & గైడెన్స్ నాకు చాలా ఎక్కువ కదా – మన జీవన విద్యకు కావాల్సినంత ప్రచారం ఇచ్చేసాను. ఇక బ్రిగేడియర్ గణేశం (పల్లెసృజన వ్యవస్థాపకులు) గారి కోడలు మానవ్ తీర్థ్ లో ఎలాగూ జీవన విద్యను సాధన చేస్తున్నారు. దాని ఆవశ్యకతను గుర్తించారు కనుక వారు కూడా అందరికీ సిఫారసు చేశారు.
4. రోజుకు 20 కిలోమీటర్లు నడవడం నా శరీరానికి సాధ్య అయ్యే పని కాదు. మనవారితో మనసుకు నచ్చిన విషయాలను మాట్లాడుకుంటూ... పల్లెవాసుల అనుభవాలు పంచుకుంటూ... ప్రకృతి అందాలకు పరవశించిపోతూ (ఎండ మంచుగా మారిపోయె) ఎలా నడిచానో నాకే తెలియకుండా నడిచేసాను.

**నా ఆత్మ బలం నాకు అర్థమైంది.**

5. ఎటువంటి ఊహలు లేకుండా... ఏది దొరికితే అది తిని.... ఎక్కడ చోటు దొరికితే అక్కడ పడుకొని... శరీరానికి అవసరమైన మౌలిక సదుపాయాలతో మూడు రోజులు గడపడం జీవితంలో ఎక్కడైనా, ఎలాగైనా ఆనందంగా జీవించగలను అనే నమ్మకం కలిగింది ఈ శోధయాత్ర.
6. యాత్రలో భాగంగా చీకటిలో నిశ్శబ్ద నడక చేయడం ఒక కొత్త అనుభూతిని కలిగించింది.
7. బ్రిగేడియర్ గణేశం గారు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ల కథలు చెబుతున్నప్పుడు వారిలో సంవేదన – దాని ఫలితంగా సంభవించిన ఆవిష్కరణ అద్భుతంగా అనిపించింది. మల్లేశం సినిమా చూసి ఉంటారు కదా.. తల్లి బాధ చూడలేక ఆయన తయారు చేసిన యంత్రం ఆవిడ నొప్పినే కాదు మరింత మంది ఆడవారి కష్టాన్ని కూడా కరిగించేసింది.
8. 90 ఏళ్ళు పైబడిన వృద్ధులను సన్మానించుకోవడం, వారిపట్ల, వారి కుటుంబ, సమాజం మరియు ప్రకృతి పట్ల వారి బాధ్యతను వారు సక్రమంగా నిర్వర్తించారని మనం గుర్తించి కృతజ్ఞతను వ్యక్తం చేయడమే.

మానవ పరంపర మనుగడ జ్ఞాన దేవాలయాలైన గ్రామాల ముంగిళ్ళలో – దేవతలైన గ్రామస్తుల చేతుల్లోనే ఉంది..... ఇది సత్యం.

# మార్చి - ఏప్రిల్ 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు




25-3-2025 న వరంగల్ జిల్లాలోని ఒక సోషల్ వెల్ఫేర్ పాఠశాల మైదానంలో జిల్లా కలెక్టర్ గారి నిధులతో ఒక పెద్ద 'హైమాస్క్ సోలార్ లైట్'ను మన ఇన్నోవేటర్ ముప్పారపు రాజు ఏర్పాటు చేయటం జరిగింది.



28 ఏప్రిల్, 2025న హైదరాబాద్ లోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల 'గోకరాజు గంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ' నుండి 30 మంది విద్యార్థులు, ప్రిన్సిపాల్, హెచ్ఓడిలు, ఫ్యాకల్టీలు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణలపై మూడు గంటల పాటు జరిగిన ప్రజెంటేషన్ కార్యక్రమం లో బ్రిగేడియర్ గణేశం గారు, సుభాష్ లు పాల్గొని, పల్లెసృజన ఇన్నోవేటర్లు తయారు చేసిన ఇన్నోవేషన్లను గురించి వివరించడం జరిగింది.



04-3-2025 న మహబూబాబాద్ జిల్లా మల్యాలలో కృషి విజ్ఞాన కేంద్రం వారు నిర్వహించిన 'శాస్త్రీయ సలహా సంఘ సమావేశం'లో మన ఇన్నోవేటర్ షణ్ముఖరావు రైతులకు 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను ఉపయోగించటం వల్ల రైతులకు జరిగే లాభాలను గురించి తెలియజేయటం జరిగింది.



ఇటీవల దిగవంగతులైన 'పల్లెసృజన' కుటుంబ సభ్యుడు 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత కీ.శే. దరిపల్లి రామయ్య గారి కుటుంబాన్ని ఖమ్మం జిల్లాలోని వారి స్వగ్రామంలో పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు, ఎడిటర్ శశిమోహన్ గారు మరియు కొందరు వాలంటీర్లు 19 ఏప్రిల్, 2025 న కలిసి, దరిపల్లి రామయ్య గారితో పల్లెసృజనకు గల అనుబంధాన్ని, జ్ఞాపకాలను నెమరు వేరుకుని, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసినప్పటి చిత్రాలు



24-3-2025న నూజివీడు మామిడి పరిశోధనా సంస్థలో జరిగిన వ్యవసాయ ప్రదర్శనలో పాల్గొన్న పల్లెసృజన ఇన్నోవేషన్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పార్థసారథి గారు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారికి 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్లను గురించి వివరిస్తున్న సుభాష్ చందర్. ఇన్నోవేషన్లను గురించి విశదంగా తెలుసుకున్న పార్థసారథి గారు మన ఇన్నోవేటర్లను అభినందించడం జరిగింది.




ఏప్రిల్ 21, 22, 23 తేదీలలో నిజామాబాద్ లో జరిగిన 'రైతు మహోత్సవం' కార్యక్రమంలో 'రైతుల కొరకు రైతులు తయారు చేసిన' వ్యవసాయ యంత్ర పరికరాల మీద సుభాష్ చందర్ మాట్లాడటం జరిగింది. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆర్‌జెడి సుచరిత గారిచే చిరు సత్కారం. గ్రామీణ స్థాయి ఆవిష్కరణల నిమిత్తం పల్లెసృజన ఇన్నోవేటర్లు తయారు చేసిన ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది. సందర్శకుల నుండి వినూత్న స్పందన, ఎంతోమంది రైతులు, వ్యవసాయ అధికారులు మన ఇన్నోవేటర్లను అభినందించారు.



అట్టడుగు స్థాయి ఆవిష్కర్తలకు రుణాలు అందించే విధానాన్ని అన్వేషించడానికి 8 ఏప్రిల్ 2025న హైదరాబాద్ లోని టిఎస్‌సిఎబి సంస్థ ప్రతినిధి బృందం 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించారు.



ఏప్రిల్ 15, 2025న విశ్వహిందూ పరిషత్ కు చెందిన ఉన్నత స్థాయి బృందం 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించడం జరిగింది.



2025 ఏప్రిల్, 22-23 తేదీలలో హైదరాబాద్ లోని సిఎస్ఐఆర్ సంస్థలు నిర్వహించిన 'స్టార్టప్ ఎన్‌క్లేవ్-2025' కార్యక్రమంలో పాల్గొన్న 'పల్లెసృజన' బృందం.




మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం నేటి యువతకు చాలా వరకు చెట్ల పేర్లు తెలియటం లేదు. వాటిని పిల్లలకు తెలియజేసే వారు కూడా కరువయ్యారు. ఈ విషయం అవగాహన చేసుకున్న పర్యావరణవేత్త "కొమెర జాజి" పల్లెసృజనకు తాను సంస్కృతం మరియు తెలుగు లో సేకరించిన చెట్ల పేర్లను తెలియజేస్తున్నాడు. వీటిని మీ చిన్నారులచేత తప్పక చదివించండి. వీలైతే మీ పరిధిలో వారు అడిగిన చెట్లను చూపించండి. ఇలా చేయటం వల్ల ప్రకృతి పట్ల చిన్నారుల్లో అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో వారికి చెట్లపైన అవగాహన పెరిగి, పర్యావరణం రక్షించదానికి దోహద పడుతుంది. **- ఎడిటర్**

**(గత సంచిక తరువాయి)**

**చెట్ల పేర్లు**

| వ.సం. | సంస్కృతం | | తెలుగు |
|---|---|---|---|
| 431 | పధ్యశాల | - | చిర్రికూర |
| 432 | పనస ఫల | - | పనస పండు |
| 433 | పయశ్యా | - | దుష్టపు తీగ |
| 434 | పరుమ | - | పాలసా పళ్ళు |
| 435 | పరూషక | - | పట్టీత కాయలు |
| 436 | పలాండు | - | నిరుల్లిపాయ |
| 437 | పలాశ | - | మోదుగ చెట్టు |
| 438 | పాక రంజన | - | ఆకు పత్రకము |
| 439 | పాకల | - | చంగల్వ కోస్టు |
| 440 | పాటలా | - | కలిగొట్టు చెట్టు |
| 441 | పాఠా | - | విషబొద్ధి చెట్టు |
| 442 | పార్థా | - | తెల్లమద్ది చెట్టు |
| 443 | పారావత | - | పాలసా పళ్ళు |
| 444 | పారావతాంగ్రీ | - | పిన్నమ వేరు |
| 445 | పారిజాత | - | పారిజాతపు చెట్టు |
| 446 | పారిభద్ర | - | బాడిత చెట్టు |
| 447 | పారీష | - | గంగరావి చెట్టు |
| 448 | పర్పణ | - | పాపిటి చెట్టు |
| 449 | పారేవత | - | ఈడే పండు |
| 450 | పార్కటీ | - | జువ్వి చెట్టు |
| 451 | పార్వతి ఉమా | - | సీమ అవిసి విత్తులు |
| 452 | పొలంకి | - | పోలంకి కూర |
| 453 | పాషాణ భేది | - | పిండికొండ చెట్టు |
| 454 | పిండమూల | - | గాజర గడ్డలు |
| 456 | పిచుల | - | పక్కి చెట్టు |
| 457 | పిండితల | - | మంగ చెట్టు |
| 458 | పితృ తర్పణ | - | నువ్వులు |
| 459 | పీతకర వీర | - | పచ్చ గన్నేరు |
| 460 | పీత దారు | - | సరళ దేవదారు |
| 461 | పీత భద్రక | - | కొండగోగు |
| 462 | పీతసాల | - | వేగిస చెట్టు |
| 463 | పుత్రజీవ | - | పుత్ర జీవి చెట్టు |
| 464 | పనర్ణవ | - | తెల్ల గలిజేరు |
| 465 | పున్నాగ | - | పొన్నచెట్టు |
| 466 | పుష్కర మూల | - | పుష్కర మూలము |
| 467 | పుష్ప కాసీస | - | పుష్ప కాసీసము |
| 468 | పుష్ప ఫలే | - | బూడిద గుమ్మడికాయ |
| 469 | పుష్పంజనము | - | పుష్పంజనము |
| 470 | పూతనా | - | గంధమాంశి |
| 471 | పూతిగంధ | - | పూత పిల్లిగెడ్డ |
| 472 | పూతిక రంజ | - | నెమలమడుగు చెట్టు |
| 473 | పూరీ | - | వెన్న వెదురు చెట్టు |
| 474 | పూర్ణి | - | నాగమల్లి చెట్టు |
| 475 | పృస్ని పర్ణి | - | కోలపొన్న |
| 476 | పేరుకం | - | జామి చెట్టు |
| 477 | పొడపత్రి | - | పొడపత్రి ఆకు |
| 478 | పోటగళా | - | కోరపాలకూర |
| 479 | పౌష్కర | - | పుష్కర మూలము |
| 480 | ప్రణిక | - | పెరుగుతోటకూర |
| 481 | ప్రపున్నాట | - | తగిరస చెట్టు |

| వ.సం. | సంస్కృతం | | తెలుగు |
|---|---|---|---|
| 482 | ప్రసాదిని | – | తొగరు చెట్టు |
| 483 | ప్రసారిణి | – | గొంతిమ గోరు చెట్టు |
| 484 | ప్రిక్కా | – | పిక్కి చెట్టు |
| 485 | ప్రియాంగు | – | ప్రెంఖరపు చెట్టు |
| 486 | ప్రియాల | – | మొరళి పండు |
| 487 | ప్లక్ష | – | జువ్వి చెట్టు |
| 488 | ప్లిహనస | – | విత్తు బోడతరము |
| 489 | ప్లిహారి | – | వెంపలి చెట్టు |
| 490 | ప్లిహ శత్రు | – | మూలమోదుగ |
| 491 | ఫణిర్జక | – | గగ్గెర |
| 492 | ఫలామ్లక | – | చింత చెట్టు |
| 493 | ఫల్లు | – | బ్రహ్మ మేడి |
| 494 | ఫల్లు | – | బ్రహ్మ మేడి |
| 495 | ఫేనిల | – | కుంకుడు చెట్టు |
| 496 | ఫేనిల | – | కుంకుడు చెట్టు |
| 497 | బధరి | – | రేగు చెట్టు |
| 498 | బర్బరి | – | కుక్క వాయింట చెట్టు |
| 499 | బార్బరాగంధ | – | వాయింట చెట్టు |
| 500 | బర్ భూర | – | నల్లతుమ్మ చెట్టు |
| 501 | బరహి చూడ | – | మాచిపత్రి |
| 502 | బలభద్ర | – | కలు కానుగ చెట్టు |
| 503 | బలాకా | – | బలుసు చెట్టు |
| 504 | బస్తాంత్రి | – | గాడిద గడప చెట్టు |
| 505 | బహిర్గంది | – | మేరు పనస చెట్టు |
| 506 | బభూపుత్రి | – | లింగదొండ |
| 507 | బహుపుష్ప | – | బూడిద చెట్టు |
| 508 | బాదమా | – | బాదం కాయలు |
| 509 | బాలకం | – | కురువేరు |
| 510 | బాహ్లీక | – | కుంకుమ పువ్వు |
| 511 | బిబీ | – | దొండ చెట్టు |
| 512 | బిల్వ | – | మారేడు చెట్టు |
| 513 | బిల్వ గంధ | – | గగ్గెర |
| 514 | బీజక | – | వేగిస చెట్టు |
| 515 | బీజ పూర | – | మాదీ ఫలము |
| 516 | బీజ రేచన | – | నేపాళము |
| 517 | బృహోజ్జంబీర | – | గజనిమ్మ కాయ |
| 518 | బృహత్ఫళా | – | బూడిద గుమ్మడికాయ |
| 519 | బృహతి | – | నేలములక |
| 520 | బృహల్లోని | – | పెద్ద పావిలి కూర |
| 521 | బోళ | – | బాలింత బోలు |
| 522 | బ్రహ్మదండి | – | దండి చెట్టు |
| 523 | బ్రహ్మదారు | – | గంగరావి చెట్టు |
| 524 | బ్రహ్మ మేఘుల | – | ముంజధర్బ |
| 525 | భక్తికా | – | వెన్న వెదురు కూర |
| 526 | బల్లాతక | – | జీడి గింజలు |
| 527 | భక్షపత్ర | – | తమలపాకులు |

| వ.సం. | సంస్కృతం | | తెలుగు |
|---|---|---|---|
| 528 | భారవాజీ | – | బలుసు చెట్టు |
| 529 | భీండ | – | బెండకాయ |
| 530 | భిక్ష | – | తెల్ల బోడతరము |
| 531 | భూచనక | – | వేరుసెనగ కాయలు |
| 532 | భూజంబు | – | నేల నేరేడు చెట్టు |
| 533 | భూతగ్ని | – | భుజపత్రి చెట్టు |
| 534 | భూతదాంత్రి | – | నేల ఉసిరిక చెట్టు |
| 535 | భూతికమ్ | – | తురక వేప చెట్టు |
| 536 | భూనింబ | – | భూమి పంచకము |
| 537 | భూమి చంపక | – | భూమి చంపకము |
| 538 | భూర్జపత్ర | – | భుజపత్రి చెట్టు |
| 539 | భృంగరాజ | – | గుంట గలగర |
| 540 | భోగవల్లభ | – | మంచి గంధము |
| 541 | మంజరీ | – | ప్రబ్బలి చెట్టు |
| 542 | మంజుల | – | అంజీర పండు |
| 543 | మంజీష | – | మంజిష్టా |
| 544 | మండూక పర్ణి | – | మండూక బ్రహ్మి |
| 545 | మకాయ | – | మొక్కజొన్న పొత్తులు |
| 546 | మత్స్యక్షి | – | పొన్నగంటి కూర |
| 547 | మదన | – | మంగ చెట్టు |
| 548 | మదనగంటా | – | మదన బుడత చెట్టు |
| 549 | మదశాఖ | – | మట్టు బచ్చలి |
| 550 | మధు కర్కటి | – | మదునానబ చెట్టు |
| 551 | మధు కేసరి | – | తియ్యమాది ఫలము |
| 552 | మధుజం బిర | – | తియ్యనిమ్మకాయ |
| 553 | మధు తుండి | – | తియ్యదొండ కాయ |
| 554 | మధుతృణ | – | చెరుకు |
| 555 | మధు ఫలా | – | కర్బూజ పండు |
| 556 | మధుపుష్ప | – | ఇప్ప చెట్టు |
| 557 | మధు స్రవా | – | చాగ నారమట్టలు |
| 558 | మదూక | – | ఇప్ప చెట్టు |
| 559 | మనోహర | – | మొల్లయను పుష్పము |
| 560 | మరహాట్టిక | – | మరాటి మొగ్గలు |
| 561 | మరువక | – | మరువము |
| 562 | మరుణ్మాలా | – | స్పృక్క మొగ్గలు |
| 563 | మలయూ | – | బ్రహ్మమేడి చెట్టు |
| 564 | మల్లికా | – | మల్లి చెట్టు |
| 565 | మసుర | – | చిరి సెనగలు |
| 566 | మస్తక మంజరి | – | చంచలికూర |
| 567 | మహాకంద | – | ముల్లంగి |
| 568 | మహాక సిద్ధ | – | మారేడు చెట్టు |
| 569 | మహాకాయ | – | మొక్కజొన్న పొత్తులు |
| 570 | మహా కాలా | – | కాకి దొండ చెట్టు |

**(వచ్చే సంచికలో మరికొన్ని చెట్ల పేర్లు)**

**(మరిన్ని వివరాలకు, తప్పు ఒప్పులకు 'జాజ' గారిని సంప్రదించండి**

**ఫోన్ : 9908411700**

# ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ 'ప్రకృతి మరియు సేంద్రీయ రైతు సమ్మేళనం' లో

# పల్లెసృజన ద్వారా గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల ప్రదర్శన




ఏప్రిల్ 4, 5 తేదీలలో బద్దం సురేందర్ రెడ్డి ఫంక్షన్ హాల్, పఠాన్‌చెర్వు రోడ్, శంకర్‌పల్లిలో "ఆర్గానిక్ కిసాన్ సమ్మిట్-2025" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం శ్రీ బాగయ్య గారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు రోజుల్లో సుమారు 1,500 మంది సేంద్రియ రైతులు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట జిల్లాల నుండి హాజరయ్యారు. మొదటి రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ గారు హాజరయ్యారు. రెండవ రోజు ముఖ్య అతిథిగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రివర్యులు డాక్టర్ జితేంద్ర సింగ్ గారు, చేవెళ్ల పార్లమెంటు సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు, చేవెళ్ళ శాసన సభ్యులు శ్రీ కాలే యాదయ్య గారు, కేంద్ర మాజీ మంత్రివర్యులు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు శ్రీ సుజనా చౌదరి మొదలైన వారు హాజరయ్యారు.

పల్లెసృజన తరుపున బ్రిగేడియర్ గణేశం గారి ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి 26 మంది గ్రామీణ శాస్త్రవేత్తలు (ఆవిష్కర్తలు) హాజరై 55 ఇన్నోవేషన్లను ఈ రెండు రోజుల




కార్యక్రమంలో ప్రదర్శించారు. రెండు రోజుల్లో రాష్ట్ర గవర్నర్‌తో పాటు కేంద్ర మంత్రి మన పల్లెసృజన ఇన్నోవేటర్లను వారు తయారు చేసిన ఇన్నోవేషన్లను చూసి వారితో స్వయంగా మాట్లాడి అనేక విషయాలను గూర్చి తెలుసుకొని వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామీణ స్థాయి ఆవిష్కరణలను గురించి బ్రిగేడియర్ గణేశం గారు రాష్ట్ర గవర్నర్ కు కొన్ని సూచనలు చేయడం జరిగింది. వారు సహృదయంతో అంగీకరించి, రాబోయే కాలంలో గ్రామీణ స్థాయి ఆవిష్కరణలను బయటికి తీసుకు వచ్చే కార్యక్రమం నిర్వహిస్తామని వారు సభాముఖంగా తెలియజేయడం జరిగింది. రాష్ట్ర గవర్నర్ మరియు కేంద్ర మంత్రి చేతుల మీదుగా మన పల్లెసృజన ఆవిష్కర్తలను సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాల్లో మన పల్లెసృజన ఇన్నోవేటర్ల గూర్చి అనేక వ్యాసాలు కూడా రాయడం జరిగింది.

ఈ రెండు రోజుల కార్యక్రమాన్ని సుమారు 20 రోజుల ముందు నుండి సుభాష్ ఆధ్వర్యంలో వాలంటీర్లు మోహన్, శ్రీష, నవీన్, అఖిల, మేధ, వైశాలి, బృంద, హరిణి, శశిధర్, పరశురాం మొదలైన వారు ఎంతో కష్టపడి విజయవంతం చేయడం జరిగింది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో ఈ వేదికపైన పరస్పరం ఇన్నోవేటర్లు, రైతుల మధ్య మంచి సంభాషణలు జరిగి, రెండు రోజుల్లో కొంత వ్యాపారం, కొన్ని అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. రాబోయే కాలంలో మన గ్రామీణ స్థాయి ఆవిష్కర్తలకు తప్పకుండా ఈ కార్యక్రమంలో తమ ఇన్నోవేషన్లకు ఆర్డర్లు వచ్చి, ఆర్థికంగా తోడ్పాటు అందే అవకాశం ఉంది.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొందరు ఇన్నోవేటర్ల మనోభావాలు:**

కొల్లి నాగ శ్రీనివాస్, దొడ్డనపూడి, పశ్చిమ గోదావరి జిల్లా. :

ఏప్రిల్ 4,5 తేదీలలో జరిగిన మీటింగ్ లో మీరు మా ఇన్నోవేటర్లను ప్రోత్సహించినందుకు మీకు ఎంతో కృతజ్ఞతలు. మా ఇన్నోవేటర్లు అందరితో మాట్లాడారు, మన వంతుగా సమాజానికి మేలు చేయాలి అన్నారు. అప్పుడు మీ మాట కాదనం మేము అలా చెప్పడం




తప్ప మేము సమాజానికి కృతజ్ఞతా భావంతో ఉంటాం. మీరు మా యొక్క ఇన్నోవేషన్లని అందరికీ అందుబాటు ధరలో అమ్మమన్నారు. అప్పుడు అందరితో కలిసి నేను కూడా ఎందుకు తగ్గించాలి అన్నాను. ఆ మాట నేను అనకుండా ఉండాల్సింది సార్. పల్లెసృజన కుటుంబంలో వాలంటీర్లు అణిన సుభాష్ గారికి, అఖిల గారికి మిగిలిన వాలంటీర్లకు మా సౌకర్యాలు చూసుకున్నందుకు, మీటింగ్ గురించి మార్గదర్శకత్వం చేసినందుకు ధన్యవాదములు. గణేశం గారు, మీరు సమాజం కోసం చేసిన కృషికి, మేలుకి ఇన్నోవేటర్లయిన మేము కూడా మాకు వీలైనంత సమాజానికి మేలు చేస్తాం.

**హజ్రత్ అలీ,** ప్రకాశం జిల్లా :

నమస్కారములు. సార్ ఏమీ చదువుకోని, ఒక గ్రామంలో చిన్న మెకానిక్‌ను, నా జీవనాధారం కోసం రైతుల కొరకు వివిధ పరికరాలను తయారు చేస్తున్న నన్ను తీసుకు వెళ్ళి నేను జీవితంలో దగ్గరగా చూడటమే కుదరని గవర్నర్ గారు, కేంద్ర మంత్రి గారితో మాట్లాడేలా చేయటంతో పాటు, వారి చేతుల మీదుగా పురస్కారం అందుకునేలా చేసిన 'పల్లెసృజన'కు నేనెంతో కృతజ్ఞతలు తెలియజేసు కుంటున్నాను. నా జీవితంలో ఇదో పెద్ద మైలు రాయిగా భావిస్తున్నాను సార్. ఒక సామాన్యుడినైన నాకు ఇంతటి గౌరవాన్ని ఇచ్చి, నన్ను ఉభయ రాష్ట్రాల రైతాంగానికి పరిచయం చేసుకునే భాగ్యం కలిగించిన మీకు ఎంతో ఋణపడి ఉంటాను సార్. గ్రామాల్లో వారికి అవసరమైన పని ముట్లను చేయించుకుని అవి బాగున్నాయి అంటే అభినందనలు, సంతోషం వ్యక్తం చేయటమే నేను ఇంతవరకు చూశాను. నేనేదో నా జీవన భృతి కోసం ఈ పనులు చేసుకుంటున్నాను అనుకున్నానే తప్ప, నేను ఇన్నోవేటర్‌ను అని నాకే తెలియలేదు. అలాంటి మీరు నన్ను ఇన్నోవేటర్‌ను చేసి, రాష్ట్ర స్థాయి వ్యక్తిగా గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను.

**సయ్యద్ హమీద్ పాషా,** మండ్లెం, నంద్యాల జిల్లా :

అన్నా, మిమ్మల్ని నా జీవితంలో మర్చిపోలేను అన్నా. నేనేదో నా అవసరం కోసం ఒక యంత్రం తయారు చేసుకుని, నా అవసరం తీరటం తో పాటు అది నాకు ఒక ఆదాయ మార్గంగా మారింది అని సంతోష పడుతున్నాను. అలాంటిది నన్ను ఒక ఇన్నోవేటర్ అని నన్ను నాకే పరిచయం చేశారు. నేను కలలో కూడా ఊహించని విధంగా గవర్నర్‌ను, కేంద్ర మంత్రిని మరెంతో మంది పెద్దలను ప్రత్యక్షంగా కలుసుకునే భాగ్యం కలిగించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు అన్నా. మీ స్ఫూర్తితో రైతుల కోసం మరెన్నో ఇన్నోవేషన్లను తయారు చేసి, మీ ద్వారా వాటిని సమాజానికి అందిస్తాను. ధన్యవాదములు.

**వెల్లె శ్రీనివాస్,** ఖమ్మం జిల్లా :

రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలో జరిగిన రైతు సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొనడం నాకెంతోషాన్నిచ్చింది. అక్కడ జరిగిన కార్యక్రమంలో మా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లను ప్రత్యేక ఆహ్వానితులు చూసి గౌరవించడం మాకెంతో గర్వకారణం. ఆ రెండు రోజులు మా జీవితంలో మరచిపోలేనటువంటి మధుర అనుభూతి అక్కడ నిర్వాహణ చేసిన ఏకలవ్య ఫౌండేషన్ కార్యక్రమాన్ని చాలా శ్రద్ధతో ఒక పద్ధతిలో నిర్వహించారు. అన్ని రకాల వసతులు కల్పించారు. ఇన్నోవేటర్లకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు కేంద్ర మంత్రుల చేతులమీదుగా వేదికపైన సన్మానించడం, సత్కరించడం చాలా అద్భుతమైన విషయం. అక్కడ రైతులతో మాకు మంచి పరిచయాలు ఏర్పడడం, వారినుంచి మాకు గౌరవం కూడా లభించింది. అలాగే మా ఉత్పత్తులను రైతులకు తెలియజేయడం కోసం, వాటిని విక్రయించడం కోసం ఒక మంచి సదవకాశంగా నేను భావిస్తున్నాను. ఇలాంటి అద్భుతమైన చక్కటి అవకాశాన్ని మాకు కల్పించిన గౌరవనీయులు బ్రిగేడియర్ గణేశం గారికి నా హృదయపూర్వక పాదాభివందనములు.

**పంపన శ్రీనివాస్,** కాకినాడ జిల్లా :

ఏకలవ్య గ్రామీణ వికాసం సంస్థ వారు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మన పల్లెసృజన కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయడం అనేది మన బ్రిగేడియర్ గణేశం గారికి ఉన్నటువంటి గౌరవంతో మనకు ఒక వేదిక దొరికింది. మన ఇన్నోవే టర్లు అందరికీ ముఖ్యంగా ఒక ఆత్మీయ జరిగింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు కేంద్ర మంత్రివర్యులు ఇతర పెద్దల చేతుల మీదుగా ఇన్నోవేటర్లు అందరం సత్కారాలు అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమానికి అతి ముఖ్యంగా పల్లెసృజన వాలంటరీ సభ్యులు అందరూ కూడా ఇన్నోవేటర్లకన్నా ఎక్కువగా కష్టపడ్డారు వారికి నా ధన్యవాదములు. నేను ఇటువంటి ప్రదర్శనకు రావడం మొదటిసారి అయితే ఆ వేదికపైన పెద్ద పెద్ద నాయకులు, శాస్త్రవేత్తలతో ప్రశంసలు అందుకోవడం నా అదృష్టం. మిగతా ఇన్నోవేటరు సోదరుల ఆవిష్కరణలు చూసి చాలా గర్వంగా ఉంది. ప్రకృతి వ్యవసాయం పట్ల వారికున్నటువంటి లక్ష్య సాధనతో రైతులతో మన భూదేవిని విషపూరితం చేయవద్దు అన్న వాగ్దానాలు నా మనసుకు హత్తుకున్నాయి. ఏకలవ్య సంస్థ వారు రెండు రోజుల పాటు మనందరికీ పెట్టినటువంటి ఫలహార మరియు భోజనాలు ఒక రైతుగా ఆ ఆహారం ఎంత విలువైనదో నాకు తెలుసు. ఎప్పటికీ మర్చిపోలేని ఆరోగ్యకరమైన భోజనం. మన భావి తరాలను గురించి ఇలా ఆలోచించాలి అన్న సిద్ధాంతం, ఒక మనిషికి సమాజానికి మెరుగు పరిచే కట్టుబాట్లు, క్రమశిక్షణ నేను మరల బాల్యంలో ఒక విద్యార్థిగా నేర్చుకున్నాను. ఇలాంటి అనుభూతులను అనుభవాలను మరల మాలాంటి వారికి అందజేయాలని అంతే కాకుండా మాలో సృజనాత్మకత శక్తిని పెంపొం దించడానికి మా 'పల్లెసృజన' చేస్తున్నటువంటి కృషికి ధన్యవాదములు. బ్రిగేడియర్ గణేశం గారికి ప్రత్యేక ధన్యవాదములు అందజేస్తూ కృతజ్ఞతలు.

# కెజిఆర్, సిఇటి ముందడుగుతో సురంగల్ గ్రామంలో
# కూరగాయల నిల్వ గది - సహజ శీతలీకరణ కేంద్రం




వినియోగదారుల్లో చాలామంది మార్కెట్లో కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు "ధరలు మండిపోతున్నాయి" అంటారు. అలాగే తక్కువగా ఉన్నప్పుడు "హమ్మయ్య కూరగాయల ధరలు బాగా తక్కువగా ఉన్నాయి" అని ఊరట పొందుతారు. కానీ, రైతు మాత్రం కూరగాయలు పండించాలంటే ఏ కాలంలో నైనా తన కష్టంలో మాత్రం ఏమీ తేడా ఉండదు. ధరలు బాగా ఉంటే కొద్దిగా లాభం వస్తుంది, తక్కువగా ఉంటే నష్టపోతాడు. ఇలా చాలాసార్లు రైతు మాత్రం నష్టాల బాట పడుతునే ఉంటాడు తన జీవితమంతా. కూరగాయలు పండిన తర్వాత వాటిని తెంపక తప్పదు. తెంపిన తర్వాత మార్కెట్‌లో ధరలు ఎలా ఉన్నా, వాటిని తరలించి అమ్ముకోకా తప్పదు. వాటిని నిల్వ ఉంచుకోవటం కుదరదు ఎందుకంటే అవి కుళ్ళిపోతాయి. రైతు ఇలా నష్టాల బాట పట్టకుండా కొంత ఊరటనివ్వటానికి ఈ సమస్య గుర్తించిన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (CIST) బృందం – ఫ్యాకల్టీ (శ్రీ బి. లింగం గారు – ప్రధాన ఆవిష్కర్త) మరియు ప్రొఫెసర్ సంయుక్త పెంట ఆధ్వర్యంలో విద్యార్థులు కలిసి లోతుగా అధ్యయనం చేశారు. ఈ సంస్థ కెజిఆర్ సిఇటి కాళాశాలకు అనుబంధంగా పని చేస్తుంది.

ఈ సమస్య పరిష్కారానికి స్థానికంగా లభ్యమయ్యే వస్తువులతో ప్రాథమిక నమూనా (ప్రొటోటైప్) తయారు చేసి, తరువాత 'తెలంగాణ ఇన్నోవేషన్ సెల్' (TGIC) నుండి వచ్చిన రూ. 1 లక్ష గ్రాంట్ పొంది, కళాశాల యాజమాన్య మద్దతుతో రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, సురంగల్ గ్రామం లో "కూరగాయల నిల్వ గది" (సహజ శీతలీకరణ గది) నిర్మించారు. ఈ గది నిర్మాణం ఎలా జరిగిందంటే....

మొదట 15 అడుగుల వెడల్పు, పొడవు కొలతలతో చతురస్రాకారంగా 4 అడుగుల లోతు గొయ్యి త్రవ్వారు. ఆ గోతిలోనుండి భూమి పైన 2 అడుగుల ఎత్తు వరకు మట్టి ఇటుకలతో గోడ నిర్మాణం చేశారు. అంటే గది మొత్తం 4+2 మొత్తం 6 అడుగుల లోతు ఉంటుంది. ఆ తర్వాత ఈ గోడకు ఒక అడుగు దూరంలో మళ్ళీ ఒక గోడ నిర్మించారు. అంటే రెండు గోడల మధ్య అడుగు దూరం ఖాళీ స్థలం ఉంటుంది. ఈ రెండు గోడల మధ్య స్థలాన్ని ఇసుకతో నింపడం జరిగింది. అలాగే గొయ్యి అడుగు భాగాన్ని కూడా అర అడుగు మందం ఇసుకతో నింపుతారు. ఆ తర్వాత నిర్మాణం పైన కూడా ఒక గ్రీన్ మ్యాట్‌ను కప్పి ఉంచుతారు. అంటే ఇప్పుడు ఆ గదిలోపలికి భూమి నుండి కాని, ప్రక్క వైపుల నుంచి లేదా పై నుంచి కూడా ఎటువంటి వేడి సోకకుండా నిర్మించబడింది.

ఈ నిర్మాణం చుట్టూ తక్కువ ఎత్తులో కొట్టం నిర్మించారు. ఆ కొట్టం పై భాగాన వెదురు తడక వేసి, దానిపైన పసుపు పచ్చటి టార్పాలిన్ కప్పి ఉంచారు. గోడల మధ్యనున్న ఇసుక మరియు గది లోపల వున్న ఇసుకను అప్పుడప్పుడూ నీటితో తడుపుతూ ఉంటారు. భూమి లోపల చల్లదనంగా ఉండటం ప్రకృతి సహజం. అలాగే రెండు గోడల మధ్య ఇసుకను తడుపుతూ ఉండటం వల్ల గది లోపలికి వేడిని


నిర్మాణంలో ఉన్న శీతల గది

వెళ్ళనివ్వకుండా చల్లగా ఉంచుతుంది. పైనుంచి కూడా వేడి ఈ గదికి సోకకుండా చాలా వరకు కొట్టం నిర్మాలిస్తుంటే ఇంకా ఏమైనా వేడి కూడా లోపలికి సోకకుండా గది పైన కప్పిఉంచిన టార్పాలిన్ నిర్మూలిస్తుంది. ఈ విధంగా ఏర్పాటు చేయటం వల్ల గది లోపల ఎప్పుడూ ప్రకృతి సహజమైన చల్లదనం ఏర్పాటు కాబడుతుంది.

ఇలా ఏర్పాటు చేసిన గదిలోపల కూరగాయలను నిలువ చేస్తే 7 నుండి 10 రోజుల వరకు ఆ కూరగాయలు పాడు కాకుడా ఉండటమే కాక, నాణ్యత కూడా లోపించకుండా ఉండటం గ్రామస్తులకు తియ్యటి అనుభవమైంది.

మార్కెట్‌లో కూరగాయలకు ఒక్కోసారి చాలా తక్కువ ధర లభిస్తుంది ఒక్కోసారి వారం పది రోజుల్లోనే మంచి మార్కెట్ విలువ లభిస్తుంది. కాబట్టి మార్కెట్‌లో విలువ తక్కువ ఉన్నప్పుడు ఈ కూరగాయలను ఈ గదిలో నిల్వ ఉంచుకుని మార్కెట్ ధర బాగా ఉన్నపుడు వాటిని తరళించవచ్చు. అలాగే రోజూ కూరగాయలు అమ్ముకునే రైతులు ఒక్కో రోజు అమ్ముడు పోక మిగిలి పోయిన కూర గాయలు పాడైపోతాయి అన్న భయం లేకుండా, వాటిని పారవేయకుండా ఈ గదిలో నిలువ చేసుకున్నట్లయితే అవి తాజాగా ఉంటాయి. ఈ విధంగా రైతుకు మార్కెట్ ధర విషయంలో కొంత వెసులు బాటు లభించి లాభాలు సమకూర్చుకునే సదుపాయం ఏర్పడుతుంది. ఇది సంప్రదాయ శీతలీకరణ (Traditional Cooling) పద్ధతిపై ఆధారపడినది. స్థానిక సామాగ్రితో నిర్మించిన ఈ గది పర్యావరణానికి హానికరం కానిది. అంటే ఉష్ణోగ్రత, తేమ వంటి అంశాలను చుట్టూ గోడల మధ్య ఉన్న ఇసుక ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, వ్యవసాయ ఉత్పత్తుల తాజదాన్ని కాపాడుతుంది. దీని నిర్వహణకు ఎటువంటి విద్యుత్తు లేదా ఇతర ఖర్చులు ఏవీ అవసరం లేదు. కేవలం అందులో కూరగాయలు నిలువ చేసుకున్న రైతులు వాటిని ఎవరూ తీసుకు పోకుండా (దొంగల భయం లేకుండా) కాపలాగా ఉండాల్సి వస్తుంది.

ఈ గది నిర్మాణం కొరకు ఆ గ్రామ సర్పంచ్ కొంత స్థలాన్ని కేటాయించడంతో

ఇప్పుడు సురంగల్ గ్రామ రైతులకు ఇది ఒక వరంగా మారింది. మార్కెట్ ధరలు తక్కువగా ఉన్నా, కూరగాయలను నిల్వ ఉంచి, సరైన సమయంలో విక్రయించ గలుగుతున్నారు. ఫలితంగా పంటల నష్టం తగ్గి, ఆదాయం పెరుగుతోంది.

విద్యా సంస్థలు సమీప గ్రామాల్లోకి వచ్చి రైతుల సమస్యలకు వారి విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రోత్సహించి పరిష్కారాలు చూపిస్తే అదే నిజమైన సామాజిక ఆవిష్కరణ. అదే సామాజిక ప్రగతి, సమాజానికి బలం. ఇలాంటి శీతలీకరణ గదిని సురంగాపురం గ్రామానికి ఇచ్చిన కెజిఆర్‌సిఇటి కళాశాల యాజమాన్యం, టిజిఐసి ఆర్థిక సహాయం, గ్రామస్తుల సహకారాన్ని పల్లెసృజన మనస్ఫూర్తిగా అభినందిస్తోంది. ఇలాంటి ప్రజలకు కావలసిన, ప్రజలతో చర్చించి, గ్రామాల్లో తయారయ్యే ఇన్నోవేషన్లు గ్రామాలకు బాగా ఉపయోగపడేలా ఉండే వాటిని మరిన్ని విద్యాసంస్థలు భవిష్యత్తులో తయారు చేస్తాయని పల్లెసృజన ఆశిస్తున్నది. ఈ సహజ శీతలీకరణ గదిని ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న 'పల్లెసృజన', టిడిఐసి, కెజిఆర్‌సిఇటి సంస్థల సభ్యులు మాట్లాడారు. ఈ శీతలీకరణ గది నిర్మాణం మరియు కార్యక్రమం మొత్తం శ్రీమతి సంయుక్త పెంట గారి ఆధ్వర్యంలో జరిగింది. ●

**సహజ శీతలీకరణ గది తయారు చేసుకోవాలనుకున్న వారు సంప్రదించండి : శ్రీమతి సంయుక్త, ఫోన్ : 9700166315**



# పల్లె జ్ఞానం

- 'హనీబీ' ఆంగ్ర సంచిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**పశువుల్లో నులిపురుగుల నివారణకు:**

పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధపడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతు న్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు.



ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకు లను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కల పాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్ర మాన్ని బాగా కలిపి రోజు కు ఒక సారి చొప్పున 2–3 రోజులు పశువుకు తాగిస్తే నులి పురు గుల నుండి నివారణ పొంద వచ్చునట.

**పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించి పోయేలా చేస్తాయి. వీటి నివారణకు గుజరాత్‌కు చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెవుతున్నాడు. ఈయన చాలాకాలంగా తన పొలంలో ఇదే పద్ధతిని వాడుతున్నాడట. ఈయన



వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకా న్ని తయారు చేసుకుంటా డు. వేపాకులను నీటి లో వేసి ఆ నీరు మూడవ వంతు కు వచ్చే వరకు మరగబెట్టి, 200 మి.లీ. ఆ కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలా లపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివార ణ పొందవచ్చునట.

**వెల్లుల్లి పంటను చీడనుంచి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'పురుషోత్తమ్ భాయ్' ఈ ఉపాయం కూడా చెబుతున్నారు. భారత సుగంధ ద్రవ్యాల బోర్డు లెక్కల ప్రకారం 2002–2007 మధ్య లో గుజరాత్ రాష్ట్రంలో వెల్లుల్లి ఉత్పత్తి 80 శాతం పెరిగింది. ప్రత్యేకించి జునాగఢ్ జిల్లాలో అత్యధికంగా వెల్లుల్లి పండిస్తుంటారు. ఆ జిల్లాలోని రైతులు వెల్లుల్లి పంటను కాపాడ టానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్నిచ్చే సేంద్రియ పద్ధతిని



పాటిస్తున్నారు. దాన్ని పురుషోత్తమ్ భాయ్ మనకు తెలియజేస్తున్నారు. మజ్జిగ, గోమూత్రము, కుళ్ళిపోయిన సజ్జలపిండి ఈ మూడింటిని బాగా కలిపి వెల్లుల్లి వంటపై పిచికారి చేసి వంటను చీడల నుండి రక్షించుకోవచ్చు అని చెపుతున్నారు.

ఇంకొక రైతు 'రమేష్ భాయ్' మరో పద్ధతి వాడి తన వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడుకుంటున్నాడు. ఆయన ఆముదము, నీరు, బట్టలుతికే సోడను కలిపి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఒకటిన్నర లీటర్ల ఆముదము, 100 గ్రా. బట్టలుతికే సోడ, 20 లీటర్ల నీటిలో కలిపి పంటకు నీరు పెట్టిన తర్వాత రెండుమూడు సార్లు పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నారు.

**మిరప పంటను తెగుళ్ళనుండి కాపాడటానికి:**

గుజరాత్‌కు చెందిన 'పరశురామ్ భాయ్' ఈ చిట్కా కూడా చెపుతున్నారు. మిరప పంటను తెగుళ్ళ బారినుండి రక్షించుకోవటానికి ఆయన నిమ్మ, కలబంద, పొగాకులను కలిపి వాడుతుంటాడు. ఆయన 2 కిలోల పొగాకు పొడి, 2 కిలోల కలబంద, 250 గ్రా. నిమ్మరసం లను 20 లీటర్ల నీటిలో కలిపి మరిగిస్తాడు. 250 మి.లీ. ఈ ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి 8 రోజులకొకసారి మిర్చి పంటపై పిచికారి చేస్తాడు. ఈ పద్ధతి వలన మిరప పంటలో 80 శాతం వరకు తెగుళ్ళను నివారించగలిగానని చెపుతున్నాడు.



**వరి, మినుము పంటలలో చీడల నివారణకు:**

వరి మినుము పంటలను చీడలు సోకి చాలా నష్టాన్ని కలిగిస్తుంటాయి. దీని నివారణకు అనేక ఖరీదైన రసాయన పద్ధతులు

వాడినా స్వచ్ఛమైన సేంద్రియ పద్ధతి ఒకటి వుంది అంటున్నారు గుజరాత్ రాష్ట్రం లోని బనస్కాంత ప్రాంతానికి చెందిన 'జమాల్ భాయ్ నూరాభాయ్ వెహాడీ'. ఈయన పులికంప చెట్టు ఆకులు, పొగాకు, రేలకాయలు (రోడ్ల పక్కలో విరివిగా లభించే నల్లని



పొడగాటి కాయలు, ఈ చెట్ల పూత పసుపు వర్ణంలో వుంటుంది) ను కలిపి తయారు చేసుకుంటాడు. రెండు లీటర్ల ద్రావకం తయారు చేసుకోవటానికి ఆయన 200 గ్రా. పులికంప ఆకు లు మరియు పూలు, 200 గ్రా. పొగాకు చెట్లు వేర్ల పొడి, 200 గ్రా. రేల కాయ ల పొడిని మూడు లీటర్ల నీటిలో కలిపి ద్రావకం 2 లీటర్లు అయ్యేంత వరకు మరగబెట్టాలి. ఈ కషాయా న్ని నీటిలో కలిపి పంటలపై స్ప్రే చేస్తే మంచి ఫలితం ఉటుంది.

**బెండ పంటను చీడ పీడల నుండి కాపాడటానికి:**



గుజరాత్ రాష్ట్రంలోని సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, మాయానగర్ గ్రామ నివాసి 'జనక్ కుమార్ వ్రజిలాల్ చోహాన్' తన బెండ పంటను చీడ పీడలనుంచి కాపాడటానికి స్వయంగా ఓ పద్ధతిని కనుగొన్నాడు. ఈయన మెంతుల పొడిని ఉపయోగించి, ఒక ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఇది వాడటం వలన మంచి ఫలితం వుంటుంది అని చెపుతున్నారాయన. దీనికై ఆయన మెంతులను మెత్తగా నూరి పొడి చేసుకుని, ఒక కిలో పొడిని నీటిలో కలిపి మూడు రోజులపాటు మురగనిస్తాడు. మూడు రోజుల తర్వాత ఈ పొడి కొంత చిక్కగా, జిగురుగా మారుతుంది. ఆ చిక్కటి ద్రావకాన్ని మెత్తని చీపురుతో పంటపై చిలకరిస్తాడు. ఈ మెంతులకి వున్న ప్రత్యేకమైన వాసన చీడపీడలను, పురుగులను మొక్కల దగ్గరికి రానీయదు.

**ఆకుముడత పురుగు నివారణకు:**

చాలా రకాల పంటలలో ఆకుముడత తెగులు పంటకు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది. ఈ తెగులు ప్రత్యేకించి, చలికాలం, మేఘావృతమైనప్పుడు ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు గుజరాత్ రాష్ట్రం, సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, దేవీపూర్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ జయరామ్ భాయ్ లఖాత్రియా' గన్నేరు చెట్లను ఆశ్రయిస్తాడు. ఇది పూర్తి సేంద్రియ పద్ధతే అని చెపుతాడాయన. ఆయన రెండు కిలోల గన్నేరు ఆకులను తీసుకుని, మెత్తగా నూరి ముద్దచేసి, ఆ ముద్దను 5 లీటర్ల నీటిలో కలిపి ఐదారు రోజులపాటు మురగబెడ్తాడు. తర్వాత ఈ ద్రావకాన్ని కొద్దిసేపు మరిగించి, 150 మి.లీ. ఈ మరిగించిన ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి పంటపై ఆకులు క్రింద భాగానికి తగిలేలా పిచికారి చేస్తాడు. దీంతో ఆకుముడత తెగులు సమర్థవంతంగా అరికట్టబడుతుంది అంటారు. ఈ ద్రావకాన్ని మురగ బెట్టేటపుడు గాలి పారకుండా మూత పెడితే త్వరగా మురిగిపోతుందట. ఈద్రావకం బూజు తెగులుకు కూడా బాగా పనిచేస్తుంది అంటారాయన.




## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం



దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040-49253096, సెల్ : 96528 01700.

## సన్న, చిన్నకారు రైతుల పాలిట కల్పవృక్షం

# మోటార్ సైకిల్‌తో అసాధారణ సేద్యం చేస్తున్న హజ్రత్ అలి



\- వీరరాఘవ రెడ్డి

మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది చిన్న, సన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి పొలాన్ని సేద్యం చేసుకునేందుకు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఆ చిన్న కమతాలకు ట్రాక్టర్లు కిరాయికి తెచ్చుకో లేరు. ఎద్దులను పోషించే స్థోమత వారికుండదు. స్వంతంగా చేసుకోవాలి అంటే సాధ్యం కాని పని. ఇలా చాలా ఇబ్బందులకు గురవుతుంటారు. అటువంటి కోవకు చెందిన వాడే ఈ కథకి హీరో. అతని పేరు 'హజ్రత్ అలి' ఇతని స్వస్థలం ఎడ్లూరి పాడు గ్రామం, జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా. హజ్రత్ ఆలిది దిగువ మధ్యతరగతి కుటుంబం. తండ్రి టైలరింగ్ చేసేవాడు. వీరికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతుర్లు. హజ్రత్ తండ్రి టైలరింగ్ పని చేసుకుంటూనే తనకున్న కొద్ది పాటి మాగాణి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. చదువుమీద శ్రద్ధ లేక కేవలం 8వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు.

చదువు మానేసిన తర్వాత తన తండ్రికి చేదోడుగా పొలం పనిలో సహకరిస్తూ కొద్ది కాలం తర్వాత ఒక మెకానిక్ దగ్గర పనివాడుగా చేరాడు. అక్కడ బైక్ మెకానిజమ్‌తో పాటు ఆటో మెకానిజమ్ కూడా నేర్చుకున్నాడు. తాను కేవలం తన యజమానికి పని చెయ్యడమే కాక, పనిమీద చాలా శ్రద్ధ కలిగి ప్రతి పనిని చాలా జాగ్రత్తగా గమనిస్తూ అన్ని రకాల పనులను నేర్చుకుంటూ వచ్చాడు. అలా పని బాగా నేర్చుకున్న తరువాత ఒక చిన్న మెకానిక్ షాపు ఏర్పాటు చేసుకుని బైకులు రిపేరు చేస్తూ ఉండేవాడు. తన మెకానిక్ షాపు ఉండేది గ్రామంలో కాబట్టి, అక్కడ రైతులతో బాగా పరిచయం ఏర్పడింది. తనవద్దకు వచ్చిన రైతులు మాట్లాడుకుంటూ తమ అవసరానికి ట్రాక్టర్లు కిరాయికి లభించటం లేదు, ఎద్దులు రావటం లేదు, పంటలేమో పాడై పోతున్నాయి అని మాట్లాడుకుంటూ ఉండటం విన్నాడు. వారితో మాటల్లో ఇతని పనితనాన్ని గుర్తించిన కొందరు రైతులు మాకు వ్యవసాయంలో ఇలా ఇబ్బందులు వస్తున్నాయి, మంచి మెకానిక్‌వు కదా ఏదైనా రైతుకు అవసరమైన యంత్రం తయారు చెయ్యమని ప్రేరేపించారు. ఏదో ఒక చిన్న యంత్రం తయారు చేస్తే మాలాంటి చిన్న రైతులం దానితో పని చేసుకుంటాము కదా అని అతన్ని కోరటం జరిగింది.

సరే రైతులు అడుగుతున్నారు, తనకూ కొంత పొలం ఉంది కదా అని ఆలోచించి తనకు తెలిసింది కేవలం బైక్ మెకానిజమ్ కాబట్టి తనకున్న పనితనంతోనే తన మోటార్ సైకిల్‌కు అవసరమైన గొర్రు, గుంటక లాంటి పరికరాలు చేయించుకుని ప్రయోగాలు చేశాడు. అందులోని లోటు పాట్లను సవరించుకుంటూ మొత్తానికి మోటార్ సైకిల్‌తో సేద్యం సమర్థవంతంగా చేసుకునేలా తయారు చేశాడు. అలా అలా దినదినాభివృద్ధి చెందుతూ తనకు ప్రధాన ఆధారంగా మోటార్ సైకిల్ సేద్యంగా మారే స్థితికి వచ్చాడు. తన వర్క్‌షాప్ చూసుకుంటూనే తోటి రైతులకు తన మోటార్ సైకిల్‌తో సేద్యం చేసి అదనపు ఆదాయం



సమకూర్చుకున్నాడు. పొలంలో సేద్యం చేసేటపుడు అప్పుడప్పుడూ చీకటి కావటంతో మళ్ళీ రేపు ఉదయం రావాలి కదా ఎందుకులే అనుకుని మసక మసక చీకటి వచ్చేదాకా కూడా సేద్యం చేసేలా తన బైక్ చుట్టూ ఎల్ఇడి లైట్లను ఏర్పాటు చేసుకున్నాడు.

అలా తనకు తానే గురువుగా మారి, రైతుల అవసరాలను గమనించి వినూత్నంగా పనిముట్లు ఇంకా సమర్థవంతంగా పని చేసేలా వాటికి మెరుగులు దిద్దుకునేవాడు. అలా చేసుకుంటూ ఇప్పుడు తన సృజనాత్మకతతో పొలంలో గొర్రుతో దున్నుతునే బోదెలు కూడా వచ్చేలా పరికరాన్ని తయారు చేసుకున్నాడు.

ఒక్కోసారి గాలి వాన విపరీతంగా వచ్చినప్పుడు మిరప చెట్లు నేలపైకి ఒరిగిపోయేవి. వాటిని నిలబెట్టడానికి రైతులు చాలా మంది కూలీలను ఏర్పాటు చేసుకుని ఆ చెట్లను పైకి ఎత్తిపెట్టి అవి నిలబడే టట్టుగా కాలితో మట్టిని తొక్కుతూ చాలా కష్టపడటం గమనించాడు. దీనికి పరిష్కారం కనుగొనాలని తన మోటార్ సైకిల్ గొర్రుకు ఒక డోర్ సెట్ చేశాడు. అలాగే మోటార్ సైకిల్‌కు ముందు వైపు ఒక బానెట్ సెట్ చేసుకున్నాడు. అలాగే ముందు భాగంలో కోణాకారంలో ఒక చక్రాన్ని ఏర్పాటు చేనుకున్నాడు. బైక్‌లో ఏర్పాటు చేనుకున్న ఒక లివర్ సహాయంతో దాన్ని దాదాపు నేలను ఆనుకుని వెళ్ళేలా చేశాడు. ఆ తర్వాత గాలివానకు వంగిపోయిన మిరప చేలో చిన్నగా బైక్‌ను నడుపుకుంటూ వెళుతుంటే మిరప చెట్లు పైకి లేచేవి, అలా పైకి లేచిన చెట్లను నిలబెట్టేలా బైకు వెనకాల వున్న గొర్రు దున్ని, ఆ చెట్ల వైపుకు బోదెలు ఎక్కించటంతో చెట్లు బాగా నిలబడి పోయాయి.

ఈ విధంగా వినూత్న పద్ధతిలో మోటార్ సైకిల్‌తోనే చాలా కష్టమైన వ్యవసాయ పనులు చేయటంతో హజ్రత్‌కు రైతు సమాజంలో మంచి పేరు వచ్చింది. అప్పటి నుంచి ఎంతోమంది రైతులు తమకు ఒక మోటార్ సైకిల్ తయారు చేసి ఇవ్వమని అడగటం, కొందరు తమవద్ద వున్న పాత మోటార్ సైకిల్‌ను తెచ్చి ఇచ్చి దాన్ని సేద్యానికి అనువుగా తయారు చేసి ఇవ్వమనటం జరగటంతో హజ్రత్ పనితనానికి మంచి గిరాకీ ఏర్పడింది. ఇప్పటికే 100కు పైగా మోటార్ సైకిళ్లను వ్యవసాయ ట్రాక్టర్లుగా మార్చి ఇవ్వటం జరిగింది. ఇతను మోటార్ సైకిల్‌కు అమర్చిన వ్యవసాయ పనిముట్లను చూస్తే విచిత్రంగా అనిపిస్తుంది. ఏంటీ బైక్‌తో ఇంత పెద్ద వ్యవసాయ పనిముట్లతో పని చేసుకోవచ్చా అని అనుకుంటారు. అంత భారీగా కనిపిస్తుంది ఆ మోటార్ సైకిల్. అలా రైతులు వచ్చి తమ సమస్య చెబితే చాలు దానికి అవసరమైన పరికరాన్ని తన ఆలోచనతో చేసి, బైక్‌కు అమర్చి ఇవ్వటంతో ఇతను పరిసర ప్రాంతాల్లో మంచి పేరు సంపాదించుకున్నాడు.






చాలామంది ఇన్నోవేటర్లు నడుచుకుంటూ పనిచేసే పవర్ టిల్లర్‌లను తయారు చేశారు అవి బాగానే ఉన్నాయి కానీ, దాన్ని నడిపే వ్యక్తి చాలా త్వరగా అలిసి పోతాడు. తన మోటార్ సైకిల్‌తో సేద్యం చేస్తే ఎటువంటి అలసట ఉండదు, నడవాల్సిన అవసరం లేదు. కూర్చునే మీ వ్యవసాయ పనులన్నీ చేసుకోవచ్చు అంటాడు.

ప్రస్తుతం మోటార్ సైకిల్‌కు వ్యవసాయ పనిముట్లే కాదు, దానితోనే పురుగు మందు పిచికారి కూడా చేస్తున్నాడు. మోటార్ సైకిల్ ఇంజన్‌తోనే నడుచుకుంటూ పనిచేసే పవర్‌టిల్లర్‌ను కూడా తయారు చేశాడు. ఇతను తయారు చేసిన పవర్ టిల్లర్‌లో ఎటువంటి వైబ్రేషన్స్ లేకుండా సాఫీగా నడుచుకుంటూ పని చేసుకోవచ్చు. ఇప్పటికే చాలా పవర్ టిల్లర్‌లను తయారు చేసి రైతులకు అందించాడు హజ్రత్ అలి. ఇతని గొప్పతనం ఏమిటంటే మోటార్ సైకిల్ ఇంకా ఎక్కువ సమర్థ వంతంగా పనిచేసేలా, అధిక బరువును సునాయాసంగా తట్టుకునేలా మోటార్ సైకిల్‌కు కొన్ని పండ్ల చక్రాలను ఏర్పాటు చేసి, అధిక లోడు గుంజేలా దాన్ని తయారు చేస్తాడు. కాబట్టి రైతులు తమ పాత మోటార్ సైకిల్‌ను 10–15 వేలకు అమ్ముకునే బదులు ఈ విధంగా తయారు చేయించుకుంటే తమ వ్యవసాయంలో చిన్న చిన్న పనులకు ఇది బాగా పని చేస్తుంది కదా అన్న సదభిప్రాయం ఏర్పడింది. కాబట్టి ఆ ప్రాంత రైతులు ఎవ్వరూ తమ పాత మోటారల్ సైకిళ్ళను అమ్మటం లాంటి పనులు చెయ్యకుండా ఇతనికి అప్పజెప్పి తమ అవసరాలను వివరిస్తే వారి అవసరానికి అనుగుణంగా ఆ మోటార్ సైకిల్‌ను వ్యవసాయ యంత్రంగా మార్చి ఇస్తున్నాడు.

తన మెకానిజమ్, రైతు పరిజ్ఞానంతో ఇంతటి ఘనత సాధించిన హజ్రత్ అలీని 4–5 ఏప్రిల్ 2025 తేదీలలో హైదరాబాద్ సమీపంలోని శంకరపల్లిలో ఏర్పాటు చేసిన "ప్రకృతి వ్యవసాయదారుల సమ్మేళనం" కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇతని నైపుణ్యాన్ని అభినందిస్తూ సత్కరించడం జరిగింది.

హజ్రత్ అలీ మరిన్ని సృజనాత్మక ప్రయోగాలు చేసి, రైతుల ప్రతి అవసరానికి తగిన వ్యవసాయ యంత్రాలుగా వారి మోటార్ సైకిల్ లను మార్చి ఇవ్వాలని ఆశిస్తోంది 'పల్లెసృజన'. రైతులు తమ మోటార్ సైకిల్ లను అందిస్తే కేవలం 20 వేల రూపాయల ఖర్చుతో మీ వ్యవసాయానికి అవసరమైన యంత్రంగా మార్చి ఇస్తాడు. రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరుతోంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ హజ్రత్ అలి, ఫోన్ : 7569972889**

# ఎన్.ఐ.ఎఫ్. వారి ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ (ఫైన్ - 2023) పురస్కారాలు




– 'హనీబీ' ఆంగ్ల సంచిక సౌజన్యంతో –
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**ఎన్.ఐ.ఎఫ్. వారి జాతీయ ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో విజేతలకు భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 10 నుండి 13, 2023 వరకు రాష్ట్రపతి భవన్ లోనే జరిగిన "ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్ – 2023)" ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అందులో బహుమతులు పొందిన అనేక మంది ఇన్నోవేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులు పొందిన కొందరి వివరాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాము.**

## అక్రోటు కాయ ఒలిచే యంత్రం:

రాష్ట్రస్థాయి పురస్కారం

**మహమ్మద్ షఫీ అహాంగర్** (42),
అనంతనాగ్, జమ్ము & కాశ్మీర్.



జమ్ము, కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాకు చెందిన మహ మ్మద్ షఫీ వరుస ఇన్నోవేషన్‌లు చే స్తుంటాడు. ఊరికే కూర్చునే తత్వం కాదతనిది. ఇప్పుడతను అక్రోటు కాయలు పచ్చిగా ఉన్నప్పుడు వాటిని వలవటానికి సహకరించే యంత్రం కనుగొన్నాడు. చేతులతో అక్రోటు కాయలను వొలవటం చాలా కష్టంతో కూడుకున్న పనే కాక ఎక్కువ సమయం పట్టి, చేతులు, చర్మానికి గాయాలయ్యే అవకాశం ఉంటుంది. ఆ పని చెయ్యటానికి ఎంతో మంది కూలీలు కావలసి వచ్చి చాలా ఖర్చుతో కూడుకున్న పని అయిపోయింది. ఈ పరిస్థితి గమనించిన షఫీ దీనికి పనికి వచ్చే యంత్రం ఏదైనా కనుగొనాలని ఆలోచించాడు. చాలా పరిశీలించి 1 హార్స్‌పవర్ మోటార్‌తో పని చేసే యంత్రాన్ని రూపొందించాడు. ఈ మోటారు కన్వేయర్ పద్ధతిలో మూడు వేరువేరు సైజులు కల ఛానల్స్ లో అనుసంధానం చేయబడి ఉంటుంది. కంప్రెషర్ స్ప్రింగుల ద్వారా ష్రెడ్డర్ ప్లేట్లను కావలసిన సైజుకి కాయలకు అవసరమైన ఒత్తిడి కలిగించేలా ఏర్పాటు చేశాడు. మూడు సైజుల కాయలను ఒకేసారి యిది వలిచి పెడుతుంది. క్రిందికి ఒంచి ఉండటం వలన కాయ క్రిందకి జారుతున్నపుడు తిరుగుతూ ఉండే స్ప్రింగ్ ప్లేట్‌ల ఒత్తిడికి చితికి, పై పొట్టు , పప్పు వేరువేరు పడిపోయి, పొట్టు ఒకవైపు, పప్పు ఒకవైపు పడేలా ఏర్పాటు చేశాడు.

ఈ యంత్రం ఒక గంటలో 500–600 కిలోల కయలను 98% సమర్థతతో వొలిచి పెడుతుంది. తను ఈ యంత్రం తయారు చెయ్యటానికి చాలా శ్రమ పడాల్సి వచ్చిందనీ, జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో అక్రోటు కాయలు ఆగస్ట్ సెప్టెంబర్ నెలలో కోతకు వస్తాయనీ, తను ఆ రెండు నెలలలో తను తయారు చేసిన లేదా మార్పులు చేసిన యంత్రాన్ని పరీక్షించుకునే అవకాశం ఉండేదని చెప్పాడు. ఆ ప్రాంతం రైతులు అక్రోటు కాయలను నిలువ ఉంచుకోకుండా, ఎప్పటికప్పుడు వొలిచి అమ్మటం చేస్తారు.

తను చాలా సాధారణ యంత్రంతో మొదలు పెట్టానని, పనితీరు పరీక్షించి నిర్ణయం ఏర్పాటు చెయ్యటానికి తిరిగి పరీక్షించటానికి మళ్ళీ ఆగస్టు, సెప్టెంబర్ నెలలు వచ్చే వరకు ఆగాల్సి రావటంతో పూర్తిగా సంతృప్తిగా వలిచే యంత్రం తయారు చెయ్యగలిగానని చెపుతూ దీనికి తోడు తనకి ఆర్థిక సమస్యలు ఉండటంతో ఈ యంత్రాన్ని రూపొందించటానికి 4 సంవత్సరాలు పట్టిందని, మొత్తానికి వేరువేరు



సైజుల అక్రోటు కాయలను వొలిచి పెట్టే యంత్రాన్ని తయారు చెయ్యగలిగానని చెప్పాడు షఫీ.

ఈయన రెండు సైజులలో ఈ యంత్రాన్ని తయారు చేశాడు. ఒకటి పెద్దది – పెద్ద రైతుల కోసం, దీని ఖరీదు రూ. 50 వేలు, ఇంకొకటి చిన్నది – చిన్నరైతుల కోసం దీని ఖరీదు రూ. 25,000/-. ఇప్పటి వరకు తన చుట్టు ప్రక్కల జిల్లాలలో చాలా యంత్రాలు అమ్మాననీ, అక్రోటు రైతులు కాయలను వొలవటానికి పెట్టే ఖర్చులు గణనీయంగా తగ్గి లాభ పడుతున్నారు.

రైతులకు శ్రమ, ఖర్చు తగ్గించి, ఎక్కువ ఆదాయం వచ్చేలా చేసిన మహమ్మద్ షఫీ అహంగర్ కి ఎన్ఐఎఫ్ వారు ఢిల్లీలో నిర్వహించిన తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023వ సం. రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు.

**అనాస పండు (పైనాపిల్) తోలు తీసి ముక్కలు చేసే యంత్రం :**



రాష్ట్రస్థాయి పురస్కారం

**ఇంకొంగ్‌సునిప్** (47),

మొకోక్‌ఛుంగ్, నాగాలాండ్.

నాగాలాండ్ లోని మొకోక్‌ఛుంగ్ ప్రాంతానికి చెందిన ఇంకొంగ్‌సునిప్ అనే 47 సంవత్సరాల వ్యక్తి స్థానికంగా ఒక చర్చిలో పాస్టర్‌గా వ్యవహరిస్తుంటాడు. ఆ ప్రాంతంలో పండ్లు, కూరగాయలు ఎక్కువగా పండిస్తుంటారు. అమ్మటానికి వాటిని నిలువ ఎలా పెంచాలో తెలీక చాలా తక్కువ మోతాదులో పండిస్తుంటారు. ఇంకొంగ్ సునిప్ కనిపెట్టిన అనాస పండు తోలు తీసి, ముక్కలు చేసే యంత్రం కారణంగా కొంచెం వ్యాపార దృష్టితో పండ్లు కూరగాయలు పండించే అవకాశం మెరుగు పడవచ్చు.

సాధారణంగా వర్క్‌షాప్‌లో ఉండే లేత్ మిషన్ లాంటి దానికి కొన్ని మార్పులు చేసి ఆ యంత్రం కనుగొన్నాడు ఆయన. అనాస పండుని ఈ లేత్ మిషన్ లో బిగించి పండు తిరుగుతుండగా బాగా పదునుగా ఉండే ఒక బ్లేడ్ కదిలిస్తూ పండును చెక్కు తీసేస్తుంది ఈ



యంత్రం. ఈ లేత్ మెషిన్ బ్లేడు కూడా వివిధ సైజులలో అవసరానికి తగినట్లుగా మార్చి చేసుకునేలా ఏర్పాటు చేశాతడను. దీనితో ఎంత మందంగా తోలు తియ్యాలో కూడా మనమే నిర్ధారించుకోవచ్చు. ఈ యంత్రం తయారు చేసుకోవటానికి ఆయన ఒక మారుతీ కారు స్టీరింగ్ చక్రం, ఒక ఏర్ గన్‌లోని విడి భాగాలు వాడుకున్నాడు. 0.5 హార్స్‌పవర్ మోటారు సహాయంతో పని చేసే ఈ యంత్రాన్ని అతడు మూడు నెలల్లో తయారు చేశాడు. మొదట్లో బ్లేడు విషయంలో కొన్ని ఇబ్బందులు వచ్చినా, అన్నీ అధిగమించి, యంత్రం కూడా బరువు లేకుండా తేలికగా ఉండేలా రూపొందించాడు.

ఈ యంత్రం తయారు చెయ్యక ముందే ఇతడు 'పెండలం' (టాపియొకా) గడ్డని ముక్కలు చేసే యంత్రం తయారు చేశాడు. ముక్కలు చేసే పరికరం పైన ఏర్పాటు చేసిన ఒక తొట్టిలో పెండలం ముక్కలు వేసి అవి క్రింద ఉన్న కత్తిరించే యంత్రం ద్వారా కత్తిరించబడి క్రింద ఏర్పాటు చేసిన ఇంకొక గిన్నెలాంటి దానిలో ముక్కలు చేరుతాయి. ఈ యంత్రం తయారు చేసేటపుడు పెండలం గడ్డలు యంత్రంలో ఇరుక్కొని పోకుండా బ్లేడ్‌లను చాలాసార్లు వివిధ కోణాలలో బిగించాల్సి వచ్చింది. ఈ యంత్రం ఆకర్షణీయంగా కనిపించటానికి దీనిని ఒక చెక్క పెట్టెలో అమర్చాడు. దీనితోనే చిన్న ఆపిలు, పియర్ లాంటి పళ్ళ తోలు వలవడానికి ఒక చిన్న యంత్రాన్ని బిగించి, దానిని బహుళార్థ సాధక యంత్రంగా చేశాడు. అంటే పళ్ళు తోలు తీసి ముక్కలు చేసి యిస్తుంది. ఈ యంత్రం 0.5 హార్స్‌పవర్ శక్తి గల మోటారు సహాయంతో పని చేస్తుంది.

ఈయన తయారు చేసిన ఈ యంత్రం శ్రమను, సమయాన్ని తగ్గించి, ఉపాధి అవకాశాలను పెంచుతుంది. "యంత్రంతో యువతీ యువకులు ఉపాధి కోసం ఊరు వదలి దూర ప్రాంతాలకు వలస వెళ్ళిపోతుంటారు. మా ప్రాంతంలోని యువకులు యంత్రం సహాయంతో స్వయం ఉపాధి పొందవచ్చు" అంటాడాయన. జ్యూస్ షాపులు పెట్టుకోవాలనుకునే వారికి ఈ యంత్రం చాలా ఉపయోగ పడుతుంది. ఇది ఇంకా నమూనా దశలోనే ఉంది. యింకా వ్యాపార దృష్టితో దీన్ని మార్పులు చెయ్యాల్సి ఉంది.

ఊరిలోని వ్యక్తులు ఉపాధికని పరాయి ప్రాంతాలకు వలస పోకుండా గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేలా అనాస పండు తోలు తీసి, ముక్కలు చేసే యంత్రాన్ని రూపొందించినందుకు గాను

ఇంకొంగ్‌సునిప్ కి ఎన్ఐఎఫ్ వారు ఢిల్లీలో నిర్వహించిన తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023 లో రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు.

## లడ్డు తయారు చేసే యంత్రం మరియు భారీ స్థాయిలో కుదురు (నేత పనికొరకు వాడే) చేసే యంత్రం:

రాష్ట్రస్థాయి పురస్కారం

**చు వాన్‌మావియా** (58),

లంగ్లెరి, మిజోరాం.



వేడి పంచదార పాకం కలిపి ఉండే పిండిని గుండ్రంగా లడ్డులాగా చుట్టడం చాలాకష్టం. చేతులు కాలిపోయే ప్రమాదం ఉంది. ఇది అందరూ అనుభవించిన వారే. లడ్డలను చేతులు కాలకుండా కాపాడటానికి చువాన్‌మావియా తయారు చేసిన యంత్రం బాగా ఉపయోగ పడుతుంది. పైగా చాలా సమయం, ఖర్చు, శ్రమలను ఆదా చేస్తుంది.

లడ్లు చెయ్యటానికి ఉపయోగించే పిండి, బూంది, పంచదార, నూనెలు అన్ని ఒక తొట్టెలో వేస్తే దానికున్న యంత్రం ఆ మిశ్రమాన్ని గుండ్రని లడ్డులుగా చుట్టిస్తుంది. ఎక్కడికైనా తీసుకొని వెళ్ళగలిగే ఈ యంత్రం గంటకి 50 కిలోల మిశ్రమాన్ని లడ్డులుగా చుట్టిస్తుంది. ఈ యంత్రం 4 వేగాలతో పని చేస్తుంది. (మనం చేసే మిశ్రమానికి కావలసినట్లు) దాదాపు నిమిషానికి రెండు లడ్లు చుట్టగలదు. ఎంత వేడిగా ఉన్నా కూడా. ఈ యంత్రం 24 వాట్ల డిసి కరెంటు (బ్యాటరీ)తో మాత్రమే పని చేస్తుంది.

తాను తయారు చేసి ప్రారంభ దశలోని యంత్రం గురించి మాట్లాడుతూ ఇతను "నేను ముందు ఈ యంత్రాన్ని చిన్న నువ్వుండలు కలపడానికి (గోళీ సైజుంటుంది) తయారు చేశాను. తరువాత క్రమంగా సైజు పెంచుకుంటూ రకరకాల మిశ్రమాలతో లడ్డలు కట్టేలా రూపొందించాను" అంటాడు.





ప్రస్తుతం ఇతని వద్ద ఒక యంత్రం ఉంది. దీనిని తయారు చెయ్యటానికి తనకి రూ. 30 వేలు ఖర్చయింది. త్వరలోనే దీనిని వ్యాపారాత్మకంగా తయారు చేస్తానని, ఇంకా చిన్నగా, తేలికగా, ఎక్కడికైనా తీసుకొని వెళ్ళేలా రూపొందిస్తానని, అప్పుడు ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉందని చెప్పాడతను.

ఈయన రూపొందించిన మరొక ఇన్నోవేషన్ నేత పని వారికి ఉపయోగ పడే కుదురు సంబంధించింది. ఇది ఒకేసారి 20 బాబిన్‌లని (చితడలు) 3 వేరువేరు వేగాలతో (దారానికి అనుగుణంగా) చుట్టగలదు.

ఈయనచాలాకాలంగా వరుస ఇన్నోవేషన్‌లతో ఎన్ఐఎఫ్ కి పరిచయస్తుడే. 1998లోనే ముగ్గురు మాట్లాడుకునే ల్యాండ్‌లైన్ టెలిఫోన్ ని, 2016లో రైస్ ప్రాసెసర్‌ని కనుగొని ఎన్ఐఎఫ్ ప్రశంసలు పొందాడు.

కొంచెం భారీ స్థాయిలో వంటలు వండే వారందరికీ ముఖ్యంగా మిఠాయి దుకాణాల వారికి, పిండి వంటలు చేసే వారికి, గుళ్ళల్లో ప్రసాదాలు చేసే వారికి ఉపయోగ పడే విధంగా ఉండే లడ్డూలు చేసే యంత్రాన్ని తయారు చేసినందుకు గాను చువాన్ మావియా కి ఎన్ఐఎఫ్ వారు ఢిల్లీలో నిర్వహించిన తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023వ సం. రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు. ●

## గ్రామీణ సృజనాత్మక శక్తికి వేదిక 'పల్లెసృజన'

'పల్లెసృజన' ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా మాకు పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. మీ సమస్యలను 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వాటికి పాఠకులు సమాధానాలు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మన సమస్యలు బహిరంగ వేదికపై పెట్టి సమాజం నుండి పరిష్కారాలను ఆహ్వానించడమే 'పల్లెసృజన' ఉద్దేశ్యం. అందరూ సహకరించి ఈ గ్రామీణ సృజనాత్మక శక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

-ఎడిటర్

# వేసవి లో వచ్చే అనారోగ్యాలకు వైద్య చిట్కాలు


'వైద్య' కొమెర జాజి

## కండ్లు మంటల నివారణకు చిట్కాలు

వేసవి కాలంలో ఎండ తీవ్రతకు చాలా మందికి కండ్లలో మంటగా ఉండి కండ్లలో నుండి నీరు కారుతూ ఉంటుంది. ఇదంతా వంట్లోని వేడి వల్ల వస్తుంది. అందుకే ఎండా కాలం శరీరానికి వీలైనంత చల్లదనం చేకూర్చే చిట్కాలు ఆచరిస్తూ ఉంటే మంచిది. ముఖ్యంగా కండ్లలో మంటను, శరీరంలోని వేడిని తగ్గించటానికి ఈ క్రింది చిట్కాలు ప్రయోగించి ఎండాకాలం ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాడు కొమెర జాజి.

**జీలకర్రతో నివారణ:**

జీలకర్రను దోరగా వేయించి, మెత్తటి పొడి చేసుకుని ఒక గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ ఒక చెంచాడు పొడిని ఒక గ్లాసు పలుచటి మజ్జిగలో (వీలైతే ఆవు పెరుగుతో చేసిన మజ్జిగ) కలుపుకుని ప్రతిరోజు ఒక గ్లాసు సేవించినట్లయితే కండ్ల మంటలు తగ్గిపోతాయి.

**కలబందతో నివారణ:**

కలబంద ఆకు కొద్దిగా తీసుకుని, దానిపైనున్న చర్మం వలిచి లోపలి గుజ్జును రెండు చిన్న ముక్కలుగా చేసుకుని కండ్లు మూసుకుని కంటి రెప్పల పైన కొద్ది సేపు ఉంచుకున్నట్లయితే కండ్ల మంటలు తగ్గుతాయి. ఇలా వీలైతే ప్రతిరోజూ ఒకసారి లేదా రెండు రోజులకోసారి చేస్తే మంచిది.

**కీరదోస/ టమోట తో నివారణ:**

కీరదోస లేదా బాగా పండుబారిన టమోటను గుండ్రటి ముక్కలు పలుచగా చేసుకుని వాటిని కంటి రెప్పల పైన పెట్టుకుని కొద్ది సేపు పడుకున్నట్లయితే కండ్ల మంటలు తగ్గుముఖం పడతాయి. ఇలా ప్రతిరోజూ చేస్తే మంచిది.

**దుసర తీగతో వైద్యం:**

దుసర తీగను కొద్దిగా తీసుకుని, చిన్న ముక్కలుగా చేసి, రోట్లో వేసి మెత్తగా దంచి ఆ ముద్దనుండి పసరు తీయాలి. ఆ పసరులో కొద్దిగా బెల్లం కలుపుకుని ప్రతిరోజూ ఒక టీ గ్లాసు పసరు తాగితే కండ్ల మంటలే కాదు, వంట్లోని వేడి కూడా తగ్గిపోతుంది.

**సుగంధ పాల వేర్లతో చికిత్స:**

సుగంధ పాల మొక్క వేర్లు అర గుప్పెడు తీసుకుని, వాటిని నీటిలో బాగా కడిగిన తర్వాత ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టి ఉదయమే ఆ నీటిని వడబోసుకుని త్రాగినట్లయితే కండ్ల మంటలు తగ్గిపోతాయి.

**ఎండు ఖర్జూరంతో చికిత్స:**

ప్రతి రోజూ ఒక ఎండు ఖర్జూరపు పండు తీసుకుని రాయితో దంచి, అందులోని విత్తనాన్ని తీసివేసి, తొక్కును బాగా మెత్తగా అయ్యేలా దంచాలి. అది ఒక అవ్వచ్చిలాగా తయారవుతుంది. దాన్ని తీసుకుని ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టాలి. ఉదయమే ఆ నానిన ఖర్జుర పండు తిని, నానబెట్టిన నీటిని కూడా త్రాగాలి. ఇలా చేసినట్లయితే కండ్ల మంటలు తగ్గుముఖం పడతాయి.


సుగంధ పాల చెట్టు ఆకులు వేరు

## మతిమరుపు నివారణకు చిట్కాలు

కొంత మందికి మతిమరుపు ఎక్కువగా ఉంటుంది. ఇది చిన్న పిల్లల నుండి పెద్ద వాళ్ళ వరకు వచ్చే జబ్బు. దీని నివారణకు ఈ క్రింది చిట్లాను ఆచరించినట్లయితే మతిమరుపు లక్షణాలు తగ్గుముఖం పడతాయి.

**మర్రిచెట్టు వేర్లతో చికిత్స:**

మర్రిచెట్టు ఊడలు ఒక గుప్పెడు తీసుకుని, వాటిని శుభ్రమైన నీటిలో బాగా కడిగి, ఒక గ్లాసు నీటిలో ఆ వేర్లను వేసి బాగా మరిగేలా ఆ నీటిని కాయాలి. బాగా మరిగి, చల్లారిన తర్వాత ఆ నీటిని వడబోసి, అందులో బెల్లం లేదా పటిక బెల్లం తగినంత వేసుకుని ప్రతిరోజూ ఉదయమే ఆ నీటిని సేవించినట్లయితే మతిమరుపు లక్షణాలు త్వరగా తగ్గుముఖం పడతాయి.

**రావి పండ్లతో చికిత్స:**

రావిపండ్లను సేకరించి, వాటిని నీడలో బాగా ఆరబెట్టాలి. బాగా ఎండిన తర్వాత వాటిని మెత్తటి పొడిగా చేసుకుని, అందులో సమానంగా బెల్లం పొడి చేసి కలుపుకుని, ప్రతిరోజూ ఒక గ్లాసు నీటిలో ఒక చెంచాడు బెల్లం, రావిపండ్ల పొడి కలుపుకుని త్రాగినట్లయితే మతిమరుపు వ్యాధి తగ్గి జ్ఞాపక శక్తి బాగా పెరుగుతుంది.

**తులసి ఆకులతో చికిత్స:**

ప్రతిరోజూ నాలుగు తులసి ఆకులు నములుతూ ఉన్నా, లేదా తులసి తీర్థం తీసుకుంటూ ఉన్నట్లయితే మతిమరుపు లక్షణాలు తగ్గిపోతాయి. ఇంట్లోని పెరట్లో లేదా ఇంటి ముందర తులసి చెట్లను బాగా పెంపకం చేసి ఆ చెట్ల వద్ద కొద్ది సేపు తిరుగుతూ వాటి గాలిని పీల్చుకున్నా కూడా మతిమరుపు లక్షణాలు తగ్గటంతో పాటు, శరీరానికి కూడా చాలా మంచిది.

**సరస్వతి ఆకుతో చికిత్స:**

సరస్వతి ఆకును ప్రతిరోజూ నేరుగా రెండు ఆకులు తిన్నా, లేదా వాటిని నీడలో ఆరబెట్టి పొడి చేసి పెట్టుకుని, ప్రతిరోజూ ఒక చెంచాడు పొడి చేతిలో వేసుకుని అందులో ఆవునెయ్యి కలుపుకుని నాకినా లేదా సరస్వతి ఆకులు నాలుగు తీసుకుని, చిన్న చిన్న ముక్కలుగా చేసి, ఒక గ్లాసు నీటిలో వేసి, ఆ నీరు సగం దాకా వచ్చే వరకు కాచి కషాయం తయారు చేసుకుని తాగినట్లయితే మతిమరుపు లక్షణాలు త్వరా తగ్గుముఖం పడతాయి. ●

**గమనిక:** ఈ శీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

# ఆయుర్వేద జ్ఞాన మథనం


ఉమా మహేశ్వర రావు

## ఆరోగ్యం కొరకు మన ప్రాంతాల్లో విరివిగా లభించే కొన్ని ఔషధ మొక్కలతో వైద్య చిట్కాలు

**తులసి:**

మన ఇండ్లల్లో తులసి మొక్కకు నిత్యం పూజిస్తూ ఉంటారు మహిళలు. వాటి ఆకులను కూడా చాలా మంది తింటూ ఉంటారు. తులసి ఆకులను సేకరించి వాటి నుండి రసం తీసి అందులో మిరియాల పొడి కలుపుకుని తీసుకున్నట్లయితే జలుబు, దగ్గు, ఆయాసం, తుమ్ములు నివారించబడతాయి. తులసి మొక్కల వల్ల ఆక్సిజన్ ఎక్కువగా లభిస్తుంది అని పెద్దలు చెబుతూ ఉంటారు. కాబట్టి ఇంట్లో అక్కడక్కడా కుండీలలో, అవకాశం ఉన్నవారు పెరట్లో అక్కడక్కడా తులసి మొక్కలను పెంచితే మనం తిరుగాడే స్థలాలు కాబట్టి వాటి గాలి పీల్చటం వల్ల మన ఆరోగ్యం ఇంకా అభివృద్ధి చెందుతుంది. శరీరానికి కావలసినంత మంచి ఆక్సిజన్ కూడా లభిస్తుంది.

**వస:**

సాధారణంగా పూర్వం చిన్న పిల్లలకు 'వస' పోసేవారు. వసను ఒక గరుకు బండపైన కొద్దిగా నీటి చుక్క వేసి అందులో వసను రుద్దటం వల్ల వచ్చిన గంధాన్ని ఒక శంకులో పోసి చిన్న పిల్లలకు తాపే వారు. ఇలా చేయుటం వల్ల మాటలు బాగా వస్తాయని అనేవారు. అందుకే ఎవరైనా కొద్దిగా ఎక్కువగా అదేపనిగా మాట్లాడుతూ ఉన్నట్లయితే వారిని 'మీ అమ్మ వస ఎక్కువగా పోసినట్లుందిరా ఒకటే వాగుతున్నావు' అంటారు. వస మాటలు రావటానికే కాదు, ఎన్నో రోగాలను నయం చేస్తుంది. గొంతు నొప్పి వున్నా, గొంతులో నసగా వున్నా, జలుబు, తుమ్ములు, దగ్గు ఎక్కువగా ఉన్నప్పుడు వసను పొడిగా చేసుకుని ఒక గ్లాసులో అర చెంచాడు పొడి వేసుకుని తాగినట్లయితే ఉపశమనం పొందవచ్చు.

కొంతమదికి 'మూర్ఛ రోగం' (పిట్స్) వస్తూ ఉంటాయి. అటువంటి వారికి వసను పొడిగా చేసి పెట్టుకుని ఒక గాజు సీసాలో భద్రపరచుకుని ప్రతి రోజూ ఉదయమే రెండు మూడు చిటికెల పొడిని నోట్లో వేసుకుని నీరు త్రాగాలి. ఇలా రెండు సంవత్సరాల పాటు చేస్తే మళ్ళీ మూర్ఛరోగం పూర్తిగా నివారించ బడుతుంది.

**దుంప రాష్ట్రం మొక్కతో వైద్యం:**

పూర్వ చాలా ఇళ్ళల్లో 'దుంప రాష్ట్రం' మొక్క పెంచుకునే వారు. ఈ మొక్క ఆరోగ్యానికి చాలా రకాలుగా పని చేస్తుంది. ఇళ్ళల్లో కుండీల్లో దీన్ని పెంచుకుని ప్రతిరోజూ ఈ మొక్క యొక్క చిన్న ముక్కను తీసుకుని నోట్లో వేసుకుని చప్పరించినట్లయితే ఆకలి బాగా వేస్తుంది. ఒక చిన్న ముక్కను తీసుకుని కొద్దిగా దంచి గ్లాసు నీటిలో వేసుకుని బాగా మరగబెట్టి ఆ నీటిని తాగినట్లయితే శరీరంలోని నొప్పులు అన్నీ తగ్గిపోతాయి. రాత్రి పూట దుంపరాష్ట్రం చిన్న కొమ్మను తీసుకుని గంధం తీసి, అందులో కొద్దిగా తేనె వేసుకుని నాకినట్లయితే మల విసర్జన సాఫీగా జరుగుతుంది.

**సరస్వతి ఆకు:**

సరస్వతి ఆకులను తీసుకుని నీడలో ఆరబెట్టి, మెత్తటి పొడి చేసి పెట్టుకుని ఒక గాజు సీసాలో భద్రపరచుకోవాలి. చిన్న పిల్లలకు ప్రతిరోజూ ఒక చెంచాడు పొడిని చేతిలో వేసి, అందులో ఒక చెంచాడు తేనె కలిపి వారిచేత నాకిస్తూ ఉన్నట్లయితే మతిమరుపు తగ్గిపోయి, జ్ఞాపక శక్తి బాగా పెరుగుతుంది.

వీటి ఆకులను తీసుకుని మెత్తగా దంచి ఆ ముద్దను చర్మవాధులు ఉన్నవారు తమకు వ్యాధి ఉన్నచోట పూసి ఒక గంట తర్వాత సుండిపిండితో స్నానం చేసినట్లయితే తామరతో సహా ఎటువంటి చర్మ వ్యాధులైనా సరే పది పదిహేను రోజుల్లో తగ్గిపోతాయి.

**నేల ఉసిరి:**

ఈ మొక్క చాలా చిన్నదిగా ఉంటుంది. దీని ఆకులను తీసుకుని, అందులో 4-5 మిరియాలు కలిపి మెత్తగా నూరి, వేరుశన విత్తనమంత లావుగా మాత్రలు చేసి ఉంచుకోవాలి. ఈ మాత్రలను ప్రతిరోజూ మూడు పూటలా తీసుకున్నట్లయితే లివర్ జబ్బులన్నీ నయమై పోతాయి. ఇన్‌ఫెక్షన్ ఉన్నా సరే తగ్గిపోతుంది. లివర్ వాపులు ఉన్నా సరే తగ్గిపోతాయి. అంతే కాదు వీటి 4-5 రోజుల పాటు తీసుకున్నట్లయితే పచ్చకామెర్ల వ్యాధి తగ్గిపోతుంది. వైరస్‌ల వల్ల వచ్చే అనేక వ్యాధులు కూడా ఈ మాత్రలకు తగ్గిపోతాయి.

**సునాముఖి:**

ఈ సునాముఖి ఆకు కూడా కరివేపు లాగానే కనిపిస్తుంది. ఈ ఆకులను రసంలో వేసుకుని చేసుకున్నట్లయితే మల విసర్జన సాఫీగా జరుగుతుంది. ఈ ఆకులు ఏ ఆయుర్వేద మందులు మూలికలు అమ్మే షాపుల్లో అయినా లభిస్తుంది. ఈ ఆకులను పొడి చేసుకుని ప్రతి రోజూ రాత్రి ఒక అరకప్పు నీటిలో అరచెంచాడు పొడి వేసుకుని తాగి పడుకున్న ట్లయితే ఉదయమే మల విసర్జన సాఫీగా జరుగుతుంది. మల విసర్జన వ్యాధి ఉన్న వారికి ఇది ఎంతో మంచిది.




**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

honeybee.org

Palle Srujana
పల్లెసృజన
pallesrujana.org

nifindia.org



ఆవిష్కరణ
## ప్రత్తి, మొక్కజొన్న విత్తనం వేసే పరికరం



ఆవిష్కర్త
### చింతకాయల రాంబాబు
యన్.టి.ఆర్. కృష్ణా జిల్లా, తెలంగాణ

**సమస్య :**

ప్రత్తి, మొక్కజొన్న లాంటి పంటలు విత్తుకోవాలంటే విత్తనాన్ని అర అడుగుకు ఒకటి చొప్పున మనిషి చేతితో నాటాల్సి ఉంటుంది. ఇలా విత్తనాలు నాటాలంటే ఒక ఎకరా పొలంలో ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు ఒక రోజంతా విత్తాల్సి ఉంటుంది. ఇదెంతో శ్రమ మరియు ఖర్చుతో కూడుకున్న పని.

**ఆవిష్కరణ :**

ఈ సమస్యకు పరిష్కారంగా తయారైందే 'ప్రత్తి, మొక్కజొన్న విత్తనాలు వేసే పరికరం'. ఇది ట్రాక్టరు అనుసంధానిత పరికరం. దీని సహాయంతో కేవలం అరగంటలో ఒకే వ్యక్తి (డ్రైవర్) ఒక ఎకరం విత్తనం వేయవచ్చు. విత్తనాలు సరిచూసుకోవటానికి వెనకాల ఒక వ్యక్తి సహాయకాంగా ఉంటే చాలు, అతను ఏమీ కష్టపడి పని చేయాల్సిన అవసరం లేదు.

**ప్రభావం :**

ఈ పరికరం తయారు చేయడం వల్ల రైతుకు వేలాది రూపాయల విత్తనం నాటేందుకు అయ్యే ఖర్చు మిగిలించ గలిగింది. పైగా వంగుని విత్తనం నాటడానికి యువ వయస్సులైన స్త్రీలు తప్ప వయసు మీరిన మహిళలు విత్తనం నాటేందుకు రారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించింది ఈ పరికరం.

Palle Srujana
77, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. Telangana
Phone : 040-49253096, 9866001678
E-mail : president@pallesrujana.org ; Visit us : www.pallesrujana.org

honeybee.org

Palle Srujana
పల్లెసృజన
pallesrujana.org

nifindia.org



ఆవిష్కరణ
## బరువు మోయాల్సిన అవసరం లేని స్ప్రేయర్



ఆవిష్కర్త
### షేక్ మౌలాలి
ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్

**సమస్య:**

ఏ పంటలోనైనా పురుగు మందులు పిచికారి చెయ్యాలంటే స్ప్రేయర్‌ను మందు నీటితో నింపుకొని, దాన్ని భుజాన వెసుకొని పొలంలో తిరుగుతూ పంటపై పిచికారి చెయ్యాలి. ఇది చాలా బరువైన పని. వరి, పసుపు లాంటి పంటలలో ఈ భారం మరింత ఎక్కువగా ఉంటుంది.

**ఆవిష్కరణ :**

స్ప్రేయర్‌ను భుజాన వేసుకుని మోసుకుంటూ వెళ్ళి పురుగు మందు పిచికారి చెయ్యాల్సిన అవసరం లేకుండా పొలం గట్టున స్ప్రేయర్‌ను ఏర్పాటు చేసుకుని, మనిషి కేవలం 300 అడుగుల పొడవున్న పైపును తీసుకుని పొలంలోకి వెళ్తూ పంటపై పురుగు మందు పిచికారి చెసేలా సమర్థవంతమైన స్ప్రేయర్‌ను తయారు చేశాడు ఇన్నోవేటర్. ఇలా చేయటం వల్ల చాలా తేలికగా, బరువు మోయాల్సిన అవసరం లేకుండా పంటపై పురుగు మందు పిచికారి చేయటం వల్ల మరి కాస్త ఎక్కువ పని చేసుకోవచ్చు.

ఇద్దరు వ్యక్తులు చేరో పని : పొలం ఒడ్డున ఒక వ్యక్తి స్ప్రేయర్ లోకి పురుగు మందు నీళ్ళు పోస్తూ ఉంటే, రెండో వ్యక్తి పొలంలో మందు పిచికారి చేస్తూ ఉంటాడు.

**ప్రభావం :**

ఈ ఇన్నోవేషన్ వల్ల రైతులు శారీరక శ్రమ తగ్గుతుంది, పొలంలో పురగు మందు సమర్థవంతంగా పిచికారి చెయ్యవచ్చు. ఎతో సమయ, ఖర్చు ఆదా అవుతుంది. ఇది చిన్న, సన్నకారు రైతులతో పాటు పెద్ద పెద్ద కమతాలున్న రైతులకు కూడా ఎంతో ఉపయోగకరమైనది.

Palle Srujana
77, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. Telangana
Phone : 040-49253096, 9866001678
E-mail : president@pallesrujana.org ; Visit us : www.pallesrujana.org

PALLE SRUJANA Telugu Bi-monthly March - April 2025 RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే
















